


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 23-03-2026 | సంపుటి - 27 | సంచిక -300 | రూ : 4 | పేజీలు: 8


# రైతులకు పెద్దన్నగా ఉంటా

- వారి కళ్లలో ఆనందం చూడాలన్నదే లక్ష్యం
- నేటి నుంచి 45 రోజుల్లో కర్షకుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా సొమ్ము జమ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- నర్మెటలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభం.. రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన

2లో





2లో

## 21 మీటర్లు దాటితేనే హైరైజ్

- సెట్‌బ్యాక్‌ల్లోనూ టీడీఆర్ మినహాయింపులు
- అదనపు అంతస్తుల నిర్మాణానికి వెసులుబాటు
- భవన నిర్మాణ నిబంధనలు సవరించిన ప్రభుత్వం

## ఇరాన్ యుద్ధానికి ఉత్తమ ఔషధం అదే

- మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రమాదకర దశకు చేరిందన్న డబ్ల్యూహెచ్‌ఓ
- ఇరాన్, ఇజ్రాయెల్ అణు కేంద్రాల సమీపంలో దాడులపై ఆందోళన
- అన్ని పక్షాలూ సంయమనం పాటించాలని టెడ్రోస్ పిలుపు
- ఇరాన్ పవర్ ప్లాంట్లను ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరిక
- హర్మూజ్ జలసంధిపై 48 గంటల గడువు విధించిన అమెరికా



2లో



2లో

## శాస్త్రీయత లేకుండానే సుందరీకరణ

- సీడబ్ల్యూసీ నిబంధనల మేరకే వరద ముప్పు అంచనా వేయాలి
- మూసీపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో వెదిరె శ్రీరామ్
- పునరుజ్జీవానికి కాదు.. అవినీతికే మేం వ్యతిరేకం: రామచందర్‌రావు


హైదరాబాద్: మూసీ పునరుజ్జీవానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ తీరులో ఎలాంటి శాస్త్రీయత లేదని, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నిబంధనలను పాటించడం లేదని.. పేద, మధ్యతరగతి వారి ఇళ్లను కూల్చేస్తోందని సాగునీటి రంగ నిపుణులు, మహారాష్ట్ర సీఎం సలహాదారు

తరువాయి 2లో

ఇక్కడో అద్భుతం జరిగింది... 2లో

## ఎవరూ చనిపోలేదు: నెతన్యాహు

## అమెరికా ఆంక్షల ఫలితం... మరోసారి అంధకారంలోకి క్యూబా




2లో

- క్యూబాలో పూర్తిగా కుప్పకూలిన జాతీయ విద్యుత్ గ్రిడ్
- నెలలో మూడోసారి, వారంలో రెండోసారి భారీ బ్లాక్‌అవుట్
- కోటి మంది ప్రజలు అంధకారంలో.. తీవ్ర ఇబ్బందులు
- అమెరికా ఆంక్షలు, ఇంధన కొరతే కారణమంటున్న ప్రభుత్వం
- పాతబడిన విద్యుత్ వ్యవస్థతో తరచూ అంతరాయాలు




## చమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష

- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష
- పెట్రోలియం, గ్యాస్, విద్యుత్, ఎరువుల సరఫరాపై ప్రధానంగా చర్చ
- అంతర్జాతీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే 70% చమురు దిగుమతులు గల్ఫ్ యేతర దేశాల నుంచేనన్న అధికారులు
- ఎల్‌పీజీ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టీకరణ 2లో

హైదరాబాదులో శ్లాబు కూలి

## ఇద్దరు ఎలక్ట్రీషియన్ల మృతి



2లో

- బేగంపేటలో అపార్ట్‌మెంట్ శ్లాబు కూలి ఇద్దరి మృతి
- కరెంటు పని చేస్తుండగా ప్రమాదం.. ఇంటి యజమానికి తీవ్ర గాయాలు
- ఇంటి యజమాని పరిస్థితి విషమం



2లో

## చేసే పని మంచిదైతే చరిత్రలో నిలుస్తుంది

- అందుకు హైదరాబాదే సాక్ష్యం
- అమరావతి అంతకు మించిన రాజధాని అవుతుంది
- బాగా పనిచేస్తే అంతా మీ దగ్గరకొస్తారు.. విఫలమైతే ఎవరూ రారు
- జీవితంలో ఆ రెండూ చూశా
- సవాళ్లను ఎదుర్కొనే ముందస్తు ప్రణాళిక అవసరం
- ఐఎస్‌బీలో నిర్వహించిన సదస్సులో చంద్రబాబు వ్యాపార పాఠాలు

# శాస్త్రీయత లేకుండానే సుందరీకరణ

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ తీరులో ఎలాంటి శాస్త్రీయత లేదని, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నిబంధనలను పాటించడం లేదని.. పేద, మధ్యతరగతి వారి ఇళ్లను కూల్చేస్తోందని సాగునీటి రంగ నిపుణులు, మహారాష్ట్ర సీఎం సలహాదారు వెదిరె శ్రీరామ్ అన్నారు. మూసీ పునరుజ్జీవం అనేది పర్యాటక లేదా అభివృద్ధి ప్రాజెక్టు మాత్రమే కాదని.. ఇది సమగ్ర పర్యావరణ, సామాజిక, శాస్త్రీయ ప్రక్రియ అని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో భాజపా ఆధ్వర్యంలో 'మూసీ నది పునరుజ్జీవం వాస్తవాలు' అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. మూసీ పునరుజ్జీవాన్ని విస్మరించి.. సుందరీకరణకే రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని విమర్శించారు. సాంకేతిక అంశాలను విస్మరిస్తోందని, సర్కారుకు శాస్త్రీయ దృక్కోణమే లేదన్నారు. "నది సహజ వ్యవస్థలను విస్మరించి కాంక్రీటు నిర్మాణాల దిశగానే ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మూసీ ఎగువ భాగంలో అనంతగిరి నుంచి 90 కిలోమీటర్ల క్యాచ్‌మెంట్ ప్రాంతాన్ని పునరుద్ధరించడం తప్పనిసరి. వాగులు, వంకలు సహజరూపంలో ఉండి, భూమిలో నీరు ఇంకేలా ఉన్నపుడే పునరుజ్జీవం సాధ్యమవుతుంది. మంజీరా వరద జలాలతో మూసీలో ప్రవాహం ఉండేలా చేయవచ్చు. నది సహజ ప్రవాహ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలను మాత్రమే తొలగించాలి తప్ప.. నది పొడవునా తొలగించాల్సిన అవసరం లేదు. నూరేళ్లకోసారి వరదలు వచ్చే అవకాశమున్న వార్నింగ్ జోన్ ప్రాంతంలోని ఇళ్లను తొలగించాల్సిన అవసరం లేకున్నా ప్రభుత్వం తొలగిస్తోంది. కేంద్ర జలసంఘం మార్గదర్శకాల మేరకు వరద ముప్పును అంచనా వేయాలి. నది మొత్తాన్ని ఒకే వ్యవస్థ కింద నిర్వహించేలా మూసీ రివర్ బేసిన్ అథారిటీ ఏర్పాటు చేయాలి. వికారాబాద్ నుంచి కృష్ణా నదిలో కలిసేవరకు సమగ్ర ప్రణాళిక ఉండాలి. ప్రజల భాగస్వామ్యం లేకుండా మూసీ పునరుజ్జీవం విజయవంతం కాదు" అని అభిప్రాయపడ్డారు.

# 21 మీటర్లు దాటితేనే హైరైజ్

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి రేటును 15 శాతానికి చేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో జరిగిన 'సౌత్ ఏషియా లెర్నింగ్ మీట్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా, అమరావతిని ప్రపంచంలోనే ఓ అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని, అక్కడ నివసించే వారు మిగతా వారికంటే 20 ఏళ్లు ఎక్కువ జీవించేలా అత్యుత్తమ వాతావరణం కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మిగతా ప్రాంతాలతో పోల్చితే ఏపీ రాజధానిలో జీవన ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉండేలా చూస్తామని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర అభివృద్ధికి తాను చేసిన కృషిని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "1990లలో ఇంటర్నెట్ కొత్తగా వచ్చినప్పుడు ఐటీ కంపెనీలను తీసుకురావడానికి ఎంతో శ్రమించాను. ఢిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిసి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం పెట్టాలని కోరాను. నాటి ప్రధాని వాజ్‌పేయితో చర్చించి టెలికాం సంస్కరణలు తీసుకువచ్చాం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కోసం 5 వేల ఎకరాలు సేకరించాం. ట్రిపుల్ ఐటీ, నల్సార్, జీనోమ్ వ్యాలీ వంటివి నా కృషితోనే సాధ్యమయ్యాయి" అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ.. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని, భవిష్యత్తులో ప్రపంచ డేటా సెంటర్లన్నీ భారత్‌కే వస్తాయని జోస్యం చెప్పారు. ప్రస్తుతం హార్టికల్చర్, ఆక్వాకల్చర్‌లో ఏపీ అగ్రస్థానంలో ఉందని, గ్రీన్, సోలార్ ఎనర్జీని కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గతంలో తాము ప్రవేశపెట్టిన పీపీపీ విధానంలోనే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టులు, ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని గుర్తుచేశారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేసిన చంద్రబాబు, ఇకపై రాష్ట్రాన్ని వేగంగా ప్రగతి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు.

# రైతులకు పెద్దన్నగా ఉంటా

సిద్దిపేట: అన్నదాతల కళ్లలో ఆనందం చూడాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారి అభ్యున్నతికి కృషి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతూ.. అభివృద్ధికి అంకితమవుదామని.. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడదామని పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయిల్‌పామ్ పరిశ్రమను ఆదివారం ఆయన ప్రారంభించారు. పైలాన్‌ను ఆవిష్కరించారు. రూ.50 కోట్లతో తలపెట్టిన రిఫైనరీ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.200 కోట్లతో కొండపాకలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, మర్కూక్‌లో రూ.16.62 కోట్లతో తలపెట్టిన తెలంగాణ పబ్లిక్‌స్కూల్, సిద్దిపేట పురపాలికకు రూ.141.34 కోట్లతో ఉద్దేశించిన తాగునీటి పథకం, భూగర్భ మురుగు నీటి కాలువల నిర్మాణం.. ఇలా మొత్తం 12 పనులకు శంకుస్థాపన చేశారు. శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు మహోత్సవం పేరిట ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. రైతుభరోసా నిధులను ల్యాప్‌టాప్‌లో మీట నొక్కి విడుదల చేశారు. ఆయిల్‌పామ్ పరిశ్రమను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. 'ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం' బాగుండదనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం వారి సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. "ఆర్థిక సమస్యలున్నా రైతుభరోసా పంపిణీ చేస్తున్నాం. పెద్దన్నగా వారికి అండగా నిలుస్తా. ప్రస్తుత యాసంగి సీజన్‌కు మొదటి విడతగా రూ.3,600 కోట్లు పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం నుంచి అన్నదాతల ఖాతాల్లో సొమ్ము జమవుతుంది. మొత్తంగా 45 రోజుల వ్యవధిలో రూ.9వేల కోట్లు ఇస్తాం. గతంలో తొమ్మిది రోజుల్లోనే పంపిణీ చేశాం.

# అమెరికా ఆంక్షల ఫలితం... మరోసారి అంధకారంలోకి క్యూబా

కరేబియన్ దేశం క్యూబా మరోసారి అంధకారంలోకి జారుకుంది. దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా చేసే జాతీయ గ్రిడ్ (నేషనల్ ఎలక్ట్రిక్ పవర్ సిస్టమ్) శనివారం సాయంత్రం పూర్తిగా కుప్పకూలింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6:32 గంటలకు ఈ వైఫల్యం సంభవించడంతో, దాదాపు కోటి మందికి పైగా ప్రజలు చీకట్లోనే గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ వారంలో ఇలా జరగడం ఇది రెండోసారి కాగా, ఈ నెలలో ఇది మూడో అతిపెద్ద బ్లాక్‌అవుట్ కావడం అక్కడి సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ఘటనపై క్యూబా ప్రభుత్వ విద్యుత్ సంస్థ యూనియన్ ఎలక్ట్రికా సోషల్ మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేసింది. జాతీయ గ్రిడ్ పూర్తిగా డిస్‌కనెక్ట్ అయిందని, పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. కమాగ్వే ప్రావిన్స్‌లోని న్యూవిటాస్ థర్మోఎలక్ట్రిక్ ప్లాంట్‌లో జనరేటింగ్ యూనిట్ ఒకటి ఊహించని విధంగా విఫలమవడమే ఈ వైఫల్యానికి కారణమని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. ఈ నెల 4న, 16న కూడా ఇలాంటి వైఫల్యాలే దేశాన్ని గంటల తరబడి చీకట్లో ఉంచాయి. ఈ నిరంతర విద్యుత్ సంక్షోభం వెనుక అమెరికా ఆంక్షలు, ఇంధన కొరత ప్రధాన కారణాలుగా ఉన్నాయి. వెనెజువెలా నుంచి రాయితీ ధరలకు అందే చమురు సరఫరా నిలిచిపోవడం క్యూబాను తీవ్రంగా దెబ్బతీసింది. అమెరికా జోక్యంతో వెనెజువెలాలో ప్రభుత్వం మారడంతో ఈ సరఫరా ఆగిపోయింది. మరోవైపు, మెక్సికో కూడా చమురు ఎగుమతులను నిలిపివేసి, కేవలం మానవతా సాయానికే పరిమితమైంది. ఇతర దేశాలు క్యూబాకు చమురు అమ్మితే కఠిన చర్యలు తప్పవని అమెరికా హెచ్చరించడం, ఇరాన్‌తో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం వంటివి ఈ సమస్యను మరింత జఠిలం చేశాయి. క్యూబా ప్రభుత్వం తమ ఆర్థిక ఇబ్బందులకు, విద్యుత్ వైఫల్యాలకు అమెరికా వాణిజ్య ఆంక్షలే కారణమని ఆరోపిస్తుండగా, అమెరికా మాత్రం క్యూబా అనుసరిస్తున్న సోవియట్ తరహా ఆర్థిక విధానాల వైఫల్యమే దీనికి కారణమని వాదిస్తోంది. వాస్తవానికి, దేశంలోని విద్యుత్ మౌలిక సదుపాయాలు చాలా వరకు పాతబడిపోయి, తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. తాజా బ్లాక్‌అవుట్‌తో రాజధాని హవానాతో సహా పలు నగరాల్లో ప్రజలు టార్చ్‌లైట్ల వెలుగులో రోడ్లపైకి రావడం కనిపించింది. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా కేంద్రాలు వంటి అత్యవసర సేవలకు ముందుగా విద్యుత్ పునరుద్ధరించే పనులు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అయితే, ఉత్పత్తి సామర్థ్యం చాలా తక్కువగా ఉండటంతో దేశవ్యాప్తంగా సాధారణ పరిస్థితులు నెలకొనడానికి ఇంకా సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు.

# ఇరాన్ యుద్ధానికి ఉత్తమ ఔషధం అదే

మధ్యప్రాచ్యంలో యుద్ధం అత్యంత ప్రమాదకరమైన దశకు చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌లోని నతాన్జ్ అణు కేంద్రం, ఇజ్రాయెల్‌లోని దిమోనా అణు సదుపాయం ఉన్న నగరంపై దాడులు జరిగినట్లు వచ్చిన నివేదికలతో పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) దర్యాప్తు చేస్తోందని టెడ్రోస్ తెలిపారు. ప్రస్తుతానికి రేడియేషన్ స్థాయిల్లో ఎలాంటి అసాధారణ పెరుగుదల నమోదు కాలేదని నివేదికలు చెబుతున్నా, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ముప్పు సృష్టిస్తుందని హెచ్చరించారు. అన్ని పక్షాలు అత్యంత సైనిక సంయమనం పాటించాలని, శాంతే ఉత్తమ ఔషధమని పిలుపునిచ్చారు. యుద్ధం శాంతిని తీసుకురాదని, రాబోయే తరాలకు ద్వేషించడానికి కొత్త కారణాలను మాత్రమే నేర్పుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అణు ప్రమాదాలు సంభవిస్తే స్పందించేందుకు ఇప్పటికే 13 దేశాల్లో తమ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హార్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా పూర్తిగా తెరవకపోతే, ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లను ధ్వంసం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. అందులోనూ మొదట అతిపెద్ద ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని తన సోషల్ మీడియా పోస్టులలో స్పష్టం చేశారు. ఇప్పటికే ఇరాన్ నౌకాదళం, వాయుసేనతో పాటు యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ వ్యవస్థలను నిర్వీర్యం చేశామని, తమ సైనిక లక్ష్యాలకు దగ్గరగా ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, హార్మూజ్ జలసంధి తెరిచే ఉందని, కానీ శత్రుదేశాలకు మాత్రం ప్రవేశం లేదని ఇరాన్ కౌంటర్ ఇచ్చింది.

# చమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష

ఢిల్లీ: పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశంలో పెట్రోలియం, ముడి చమురు, గ్యాస్, విద్యుత్, ఎరువుల రంగాల్లో సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ కీలక రంగాల్లో సరఫరా వ్యవస్థను నిరంతరాయంగా కొనసాగించడం, లాజిస్టిక్స్‌ను పటిష్టం చేయడం, పంపిణీ వ్యవస్థలను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై చర్చించారు. దేశ ఇంధన భద్రతను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ప్రధానికి వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లలోని ఒడుదొడుకుల ప్రభావం వినియోగదారులు, పరిశ్రమలపై పడకుండా ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని ఉన్నతాధికారులు తెలిపారు. తగినన్ని నిల్వలను కొనసాగించేందుకు, సరఫరా గొలుసును బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ ఇంధన వాణిజ్యంలో కీలకమైన హార్మూజ్ జలసంధి వంటి సముద్ర మార్గాలకు అంతరాయం కలగవచ్చనే ఆందోళనల నేపథ్యంలో ఈ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలపై ప్రధాని మోదీ ఒకరోజు ముందే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శాంతి, స్థిరత్వం అవసరాన్ని నొక్కిచెప్పడంతో పాటు, అంతర్జాతీయ నౌకాయాన మార్గాలను సురక్షితంగా ఉంచాల్సిన ప్రాముఖ్యతను ఆయన వివరించారు. మధ్యప్రాచ్యంపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంలో భాగంగా, భారతదేశం ఇప్పటికే తన చమురు దిగుమతులను అమెరికా, రష్యా, నైజీరియా వంటి దేశాల నుంచి పెంచుకుంది. ప్రస్తుతం మన చమురు దిగుమతుల్లో దాదాపు 70 శాతం గల్ఫ్ యేతర దేశాల నుంచే వస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎల్‌పీజీ సరఫరాలో ఇబ్బందులు రాకుండా అమెరికా నుంచి కూడా దిగుమతులు చేసుకుంటున్నామని, వినియోగదారుల స్థాయిలో సరఫరాకు ఎలాంటి అంతరాయం లేదని వారు స్పష్టం చేశారు.



ఇక్కడో అద్భుతం జరిగింది...

# ఎవరూ చనిపోలేదు: నెతన్యాహు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం దక్షిణ ఇజ్రాయెల్‌లోని అరాడ్ నగరాన్ని సందర్శించారు. ఇరాన్ ప్రయోగించిన మిస్సైల్ పడిపోయిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. "నేను ఇక్కడ అరాడ్‌లో ఉన్నాను. ఇక్కడో అద్భుతం జరిగింది, ఎవరూ చనిపోలేదు. కానీ మనం కేవలం అద్భుతాలపై ఆధారపడదల్చుకోలేదు. ఈ పోరాటంలో మనమే గెలుస్తున్నాం, శత్రువును అణిచివేస్తున్నాం" అని నెతన్యాహు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 48 గంటల్లో జరిగిన ఘటనలు ఇరాన్ ప్రపంచ భద్రతకు ఎంత ప్రమాదకరమో నిరూపిస్తున్నాయని హెచ్చరించారు. అరాడ్, డిమోనా నగరాల్లోని పౌర ప్రాంతాలే లక్ష్యంగా ఇరాన్ మిస్సైళ్లతో దాడి చేసిందని, ఈ దాడుల్లో సుమారు 200 మంది గాయపడ్డారని తెలిపారు. అరాడ్‌లో రెండు భవనాల మధ్య క్షిపణి పడినా ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టమని, కానీ పౌరులను చంపడమే ఇరాన్ ఉద్దేశమని ఆయన ఆరోపించారు. ఇటీవల ఇరాన్ ప్రయోగించిన ఖండాంతర బాలిస్టిక్ మిస్సైల్ (ఐసీబీఎమ్) హిందూ మహాసముద్రంలోని డీగో గార్సియా సైనిక స్థావరంపై పడిందని, అది 4,000 కిలోమీటర్లు ప్రయాణించిందని నెతన్యాహు పేర్కొన్నారు. "ఇరాన్ ఇప్పుడు యూరప్ లోతుల్లోకి కూడా చేరగల సామర్థ్యం కలిగి ఉంది. వారు అందరినీ తమ పరిధిలోకి తెచ్చుకున్నారు" అని ఆయన హెచ్చరించారు. అంతర్జాతీయ సముద్ర మార్గాలను, ఇంధన సరఫరా వ్యవస్థలను బెదిరిస్తూ ఇరాన్ ప్రపంచాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తోందని నెతన్యాహు విమర్శించారు. ఇజ్రాయెల్, అమెరికాతో పాటు ప్రపంచ దేశాలన్నీ కలిసి ఇరాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తాము ఇరాన్ పౌరులను కాకుండా, ఆ దేశ పాలనాయంత్రాంగం, వారి స్థావరాలు, ఆర్థిక వనరులనే లక్ష్యంగా చేసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ ఘటనలతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి.

# చేసే పని మంచిదైతే చరిత్రలో నిలుస్తుంది

అమరావతి: 'మీరు బాగా పనిచేస్తుంటే భాగస్వాములంతా వారంతట వారే వస్తారు. విఫలమైతే ఎవరూ రారు. నా జీవితంలో ఈ రెండూ అనుభవించాను. 1999 వరకు అన్ని ఎన్నికల్లో విజయం సాధించాను. 19992004 వరకు అందరూ వచ్చి పొగుడుతుండేవారు. నేను బ్యాలెన్స్ కోల్పోయాను. 2004 ఎన్నికల్లో ఓడిపోయాను. ఎంతో అభివృద్ధి చేసిన ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని కూడా కోల్పోయాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఆదివారం నిర్వహించిన ఈవో సౌత్ ఆసియా లెర్నింగ్ సమిట్‌లో భాగంగా ట్రాన్స్‌ఫార్మింగ్ ఏఐ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డిల్యాబ్స్ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డితో నిర్వహించిన ముఖాముఖిలో చంద్రబాబు బిజినెస్ స్కూల్ విద్యార్థులకు తన రాజకీయ అనుభవాలు వివరిస్తూనే.. వ్యాపార పాఠాలు బోధించారు. యువ పారిశ్రామికవేత్తలు ప్రణాళికలతో అమరావతికి రావాలని, ఆహారశుద్ధి రంగంలో పారిశ్రామికవేత్తల అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రపంచ ఐటీ కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంలో చంద్రబాబు విజన్‌పై ప్రదర్శించిన ప్రత్యేక వీడియో ఆకట్టుకుంది. హైదరాబాద్ అభివృద్ధికి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాను చేసిన కృషిని వివరించారు. బిల్‌గేట్స్‌తో సమావేశమై నిరంతర సంప్రదింపుల ద్వారా మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చామని, హైదరాబాద్ అభివృద్ధి తెలుసుకుని అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్, బ్రిటన్ ప్రధాని టోనీ బ్లేయర్ వచ్చారని చంద్రబాబు వివరించారు. 'జినోమ్ వ్యాలీ ఏర్పాటుకు వెయ్యి ఎకరాలిచ్చాం. అక్కడ భారత్ బయోటెక్ సంస్థ తయారు చేసిన కొవిడ్ టీకా మన ప్రాణాలు కాపాడింది. ప్రధాని మోదీ కూడా 100 దేశాలకు టీకా ఉచితంగా పంపిణీ చేశారు' అని చెప్పారు. సమిట్‌లో చంద్రబాబు చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు.. 2019 ఎన్నికల్లో ఓడిపోకుండా ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వేగం కొనసాగేది. ఓటమి ఆ వేగాన్ని అడ్డుకుంది. వ్యాపారం చేస్తున్నప్పుడు అన్నీ బాగున్నాయనే అనుకుంటాం. అంతా సవ్యంగా సాగేప్పుడే జాగ్రత్తగా ఉండాలి. మనం చేస్తున్న పని, వ్యాపారం ఎంత వరకు స్థిరంగా కొనసాగుతుందనేది ఆలోచించాలి. వ్యాపారాన్ని ప్రభావితం చేసే అంశాలు రెండు.. ఒకటి అంతర్గత, రెండు బాహ్యపరమైనవి. ఇందులో సవాళ్లను ఎదుర్కొనే ముందస్తు ప్రణాళిక ఉండాలి. లేదంటే సమస్యల్లో పడతారు. వ్యాపారమైనా, రాజకీయమైనా మనం పొరపాట్లు చేయకూడదు. నా జీవితంలో నేను నేర్చుకున్నది ఇవే. 2024లో కూటమికి స్పష్టమైన ఆధిక్యం ఇచ్చారు. 94% సీట్లతో అఖండ విజయం కట్టబెట్టారు. 20 నెలలుగా బాగా పనిచేస్తున్నాం.

# హైదరాబాదులో శ్లాబు కూలి ఇద్దరు ఎలక్ట్రీషియన్ల మృతి

హైదరాబాద్‌లోని బేగంపేటలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. ఓ అపార్ట్‌మెంట్‌లోని బాల్కనీ శ్లాబు కూలిపోవడంతో ఇద్దరు ఎలక్ట్రీషియన్లు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కుందన్‌బాగ్, మెథడిస్ట్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, మూడో అంతస్తులోని తన ఫ్లాట్‌లో ఎలక్ట్రికల్ పనుల కోసం ఇంటి యజమాని దివాకర్ ప్రసాద్ ఇద్దరు ఎలక్ట్రీషియన్లను పిలిపించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన దేవిదాస్ (56), వివేక్ (32) పనులు చేస్తుండగా, యజమాని దివాకర్ బాల్కనీలో నిల్చుని ఉన్నారు. ఈ క్రమంలో బాల్కనీ శ్లాబు ఒక్కసారిగా కూలిపోవడంతో ముగ్గురూ కిందపడిపోయారు. ఈ దుర్ఘటనలో దేవిదాస్, వివేక్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన దివాకర్ ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## కోరుకొండ భక్తుల నుంచి భద్రాద్రి రామయ్యకు కోటి తలంబ్రాలు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన భక్త బృందం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో భద్రాద్రి రామయ్యకు కోటి తలంబ్రాలను సమర్పించింది. అప్పారావు ఆధ్వర్యంలో భక్తులు శిరస్సుపై గోటి తలంబ్రాలను ధరించి ఆదివారం ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో కే. దామోదర్‌రావు, ఏఈఓ శ్రవణ్‌కుమార్, వైదిక పరిపాలన సిబ్బందికి తలంబ్రాలను లాంఛనంగా అందజేశారు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన చలువాది మల్లి విష్ణు వందన 2016 నుంచి ప్రతి ఏడాది బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని లిఖించి "రామకోటి తలంబ్రాలు"ను తపాలా ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. భక్తుల ఈ వినూత్న సేవ భక్తి భావాన్ని ప్రతిబింబిస్తోంది.

## షాద్‌నగర్‌లో 'హ్యాపీ సండే' సందడి



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : షాద్‌నగర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హ్యాపీ సండే కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ బస్వం అధ్యక్షతన మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా, కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఆకట్టుకున్నారు. యోగా గురువులు ఆరోగ్యంపై అవగాహన కల్పించగా, షాద్ నగర్ లోని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ విద్యార్థులు కరాటే బృందం తమ ప్రతిభతో అలరించింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నృత్య కళాకారులు, మిమిక్రీ ఆర్టిస్టులు తమ ప్రదర్శనలతో సందడిని మరింత పెంచారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ప్రజలు 'హ్యాపీ సండే'ను ఆనందంగా, ఉత్సాహంగా గడిపారు. ప్రజలకు వినోదంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమం విజయవంతమైందని షాద్‌నగర్ పురపాలక సంఘం కమిషనర్ సునీత రెడ్డి తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. మల్కాజిగిరి డివిజన్‌కు చెందిన 9 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 2,18,500 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీశ్ గౌడ్, రుగేష్, అమీనుద్దీన్, భాగ్యానంద, ప్రభాకర్ గౌడ్, నర్సింగ్ రావు, వాసు, నవీన్ మరియు ఇతర ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మొక్క నాటిన చిన్నారి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రకృతి హరిత దీక్షకురాలు కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నైనిక రజువా మొక్కను నాటారు. ఖమ్మం జిల్లాలోని వి.యం బంజర్ లంక సాగర్ క్రాస్ రోడ్డులో ఉన్న శ్రీ వశిష్ట డెవలపర్స్ వద్ద జి.వి తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చెట్లను నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలంటే అడవుల సంరక్షణ ఎంతో అవసరమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

# మాజీ ఎల్ఎల్ప ఆరోపణల్లో వాస్తవం లేదు

* **స్పష్టం చేసిన కేతపల్లి మండలం కొండకింది గూడెం కాంగ్రెస్ నాయకులు**



ప్రజా స్ఫూర్తి నల్గొండ: నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం లో కొండకింది గ్రామంలో జరిగింది ఒకటి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడేది మరొకటి అని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడు అని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కొండకింది గూడెంలో మైనింగ్ జరుగుతుందని తప్పుడు ఆరోపణలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సొంత పట్టా భూమిలో చేపల చెరువు కోసం తవ్విన మట్టిని గ్రామంలోని పేద వర్గాలకు ఇందిరమ్మ ఇల్లు కడుతున్న వారికి డ్రైనేజీ పనులకు ఉచితంగా ఇస్తున్నామని వారు తెలిపారు. గ్రామంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీపై ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారం తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని వారు తెలిపారు. వాస్తవాలను గ్రహించి మాట్లాడాలని వారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కంపసాటి శీను గ్రామ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ దోనాలా సాయి రెడ్డి, ధర్మారెడ్డి, ఉప సర్పంచ్ వీరస్వామి, నాయకులు అల్లి సైదులు, అల్లి అంజన్ కుమార్, సురేష్, శ్రీను, వెంకన్న, లు పాల్గొన్నారు.

## కొత్తగూడెం నియోజకవర్గ పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాస్ఫూర్తి : కొత్తగూడెం నియోజకవర్గ పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం కొత్తగూడెం భజన మందిర్ సెంటర్ లోని పద్మశాలి కళ్యాణమండపంలో ఎన్నికల కన్వీనర్ పుట్టా శంకరయ్య ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా వేముల ప్రసాద్ ఉపాధ్యక్షుడుగా ఇమంది ఉదయ్ కుమార్, కార్యదర్శిగా మాచర్ల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా మాదాసి మాధవ్ రావు, ట్రెజరర్ గా కేదాసి నవీన్, ఈసీ మెంబర్లుగా వేముల మధుకర్, సామంతుల నరేష్ లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు సంఘ పెద్దలు ఆముదాల వెంకటనరసయ్య, మోతుకూరి ధర్మారావు, కనుకుంట్ల కుమార్, భోగా నారాయణ, చిప్ప శ్రీనివాస్ ఐకి సత్యనారాయణ ఇమంది ప్రసాద్, రాము, హరి కృష్ణ, రాజ్ భరత్ గణేష్ అభినందనలు తెలియజేశారు. ఈ నూతన కమిటీ ఆధ్వర్యంలో సంఘ అభివృద్ధి మరింత ముందుకు సాగాలని పద్మశాలి సంఘ పెద్దలందరూ నూతన కమిటీని కోరారు.

## అన్ని వర్గాల వారిని మోసం చేసిన బడ్జెట్




ప్రజాస్ఫూర్తి, జన్నారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందని జన్నారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారిని మోసం చేసిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. అన్ని వర్గాల వారికి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దేశానికి వెన్నెముక లాంటి రైతుకు రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, ఇప్పటికే ఉన్న రైతుబంధు పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ మూడుసార్లు ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారిని తీవ్రంగా నిరాశపరిచిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ రాజ్‌గురు సుఖ్‌దేవ్ ల 95వ వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరణ




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : దేశ విముక్తి కోసం ఉరికంబాన్ని చిరునవ్వుతో ముద్దాడిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల 95వ వర్ధంతిని పురస్కరించుకుని పి వై ఎల్, పి డి ఎస్ యు తెలంగాణ రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. వర్ధతి వాల్ పోస్టర్లను ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చేసిన ఆవిష్కరణ కార్యక్రమంలో పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. రాకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల మార్చి 23 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్ధంతి సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో రాజ్యమేలుతున్న సామ్రాజ్యవాద ధోరణులపై, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేయడమే అమరవీరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని చేతకాని Shyd సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు వెంటనే ఉపాధి కల్పించి వారి శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా కార్యదర్శి కందాల రంగయ్య, జిల్లా నాయకులు కుర్సం సురేష్, సురేష్, శ్రీకాంత్, రాజు, సురేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ కోసం ఎం ఎల్ ఏ కృషి అభినందనీయం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పునర్ వైభవం కోసం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విశేషంగా కృషి చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నూతన అధ్యక్షులు మందా హనుమంతు అధ్యక్షతన ఆదివారం తొలి సమావేశం నిర్వహించారు. సమావేశం లో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగాసాబీర్ పాషా మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ప్రయోజనాల కోసం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనుల నిమిత్తం ఎమ్మెల్యే కూనంనేని ఇప్పటికే రూ. 15 లక్షల నిధులను మంజూరు చేశారని, భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించి దీనిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. సమావేశంలో కమిటీ నాయకులు కూసపాటి శ్రీనివాస్, మద్దెల శివ కుమార్, సలిగంటి శ్రీనివాస్, కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ధర్మరాజు, కంచర్ల జమలయ్య, కమ్యూనిటీ హాల్ కమిటీ సభ్యులు మధుసూదన్, చిన్ని, పీక కృష్ణ, గుండా రమేష్, పాల్, భూపేష్, మహిళా సభ్యులు కనుకుంట్ల రాములమ్మ, కరీష రత్నకుమారి, మంద నిర్మల తదితరులు పాల్గొన్నారు.


## కారుణ్య నియామక పత్రాలను అందజేసిన మంత్రి సీతక్క



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: కారుణ్య నియామక పత్రాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఐటిడిఏ పరిధిలో వివిధ కారణాలతో మృతి చెందిన 17 మంది ప్రభుత్వ ఉద్యోగులు మృతి చెందగా 3 కుటుంబాల లబ్ధిదారులకు మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం , ఐటీడీఏ గెస్ట్ హౌజ్ లో ఈ మేరకు నియామక పత్రాలను ఇచ్చారు. విధి నిర్వహణలో ఉంటూ అకాల మరణం చెందిన ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో, వారికి ఆసరాగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ కారుణ్య నియామకాలను చేపట్టిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరామ్ నాయక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడిన సీఎం

* **పిల్లలను బాగా చదివించాలి**
* **ఉపాధ్యాయులకు సూచించిన సిఎం**




సిద్దిపేట జిల్లా, ప్రజాస్ఫూర్తి : నర్మెట లోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ శాఖలకు చెందిన స్టాళ్లలో విద్యాశాఖ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ స్టాల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ స్టాల్ వద్ద నర్మెటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. నర్మెట ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థుల విద్యా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాలలోని ఉపాధ్యాయులు బాగా పనిచేస్తున్నారని, ఫలితంగా విద్యార్థుల సంఖ్య పెరిగిందని తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో అక్కడే ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ ను ముఖ్యమంత్రి పలకరించారు. ప్రధానోపాధ్యాయుని పేరు అడిగి విద్యార్థుల సంఖ్యను ఇంకా పెంచాలని సూచించారు. పిల్లల్ని బాగా చదివించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతో చెప్పి విద్యార్థులను ఆశీర్వదించారు. సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక వెంకటస్వామి, మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన రావు లతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులతో గ్రూప్ ఫోటో దిగారు.

## ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులకు రిలీఫ్..ఇకపై ప్రతి వారం బిల్లులు !




హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్లపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. ఏ కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండరాదని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు భట్టి. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ పై బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు చేస్తోన్న విమర్శలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. త్వర త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలని ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులకు విజ్ఞప్తి చేస్తున్నానని వివరించారు. ప్రతి వారం అందుకు సంబంధించిన బిల్లులు మంజూరు చేసే బాధ్యత ప్రభుత్వానిది అంటూ కీలక ప్రకటన చేశారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. అర్హులైన వాళ్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం కోసం తమ సర్కార్ తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలను ప్రతిపక్షాలు కావాలనే విమర్శిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని కుటుంబాలకు వర్తించేలా లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేస్తామని కీలక ప్రకటన చేశారు. దీనివల్ల ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రతా లభిస్తుందని భీమా వ్యక్తం చేశారు భట్టి విక్రమార్క. ఇప్పటివరకు ఉన్న పరిమితులను తొలగించి నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని వివరించారు.

# ఇక్కడ గెలిచిన అభ్యర్థిని మంత్రిని చేస్తాం: సిద్ధిపేట ప్రజలకు రేవంత్ రెడ్డి ఆఫర్

- 2029లో సిద్ధిపేటలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్న సీఎం రేవంత్
- ఒకే కుటుంబ పాలన నుంచి సిద్ధిపేటకు విముక్తి కలగాలని పిలుపు
- సిద్ధిపేట, గజ్వేల్, సిరిసిల్లలకు కలిపి 10,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- భూసేకరణలో గత ప్రభుత్వం రైతులను భయపెట్టిందన్న సీఎం
- ఒక్కసారి మార్పు చేసి చూడాలని సిద్ధిపేట ప్రజలకు విజ్ఞప్తి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిద్ధిపేట గడ్డపై సంచలన రాజకీయ హామీ ఇచ్చారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో సిద్ధిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే, ఆ ఎమ్మెల్యేను నేరుగా మంత్రివర్గంలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. సిద్ధిపేటలో జరిగిన రైతు మహోత్సవంలో పాల్గొన్న ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. దశాబ్దాలుగా ఒకే కుటుంబం చేతిలో ఉన్న సిద్ధిపేట రాజకీయాల్లో మార్పు తప్పనిసరని సీఎం పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే, ఆ ఎమ్మెల్యేను మంత్రిని చేసే బాధ్యతను తాను, మంత్రులు దామోదర్ రాజనరసింహ, వివేక్ వెంకటస్వామి తీసుకుంటామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన సిద్ధిపేట, గజ్వేల్, సిరిసిల్ల నియోజకవర్గాలకు ఒక్కోదానికి 3,500 చొప్పున మొత్తం 10,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తమ ప్రభుత్వం నిష్పక్షపాతంగా పనిచేస్తుందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీపై వస్తున్న విమర్శలకు సీఎం బదులిచ్చారు. సిద్ధిపేట రైతుల మేలు కోసమే ఫ్యాక్టరీని ఇక్కడే కొనసాగిస్తున్నామని, తలుచుకుంటే దానిని తన నియోజకవర్గం కొడంగల్‌కు తరలించుకునేవాడినని అన్నారు. కానీ, స్థానిక రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేశామని చెప్పారు. తాను ఎమ్మెల్యేల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మల్లన్నసాగర్, రంగనాయక సాగర్ ప్రాజెక్టుల కోసం రైతులను భయపెట్టి భూములు లాక్కుందని, కానీ తాము నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల కోసం 98.5 శాతం మంది రైతులకు మెరుగైన పరిహారం ఇచ్చి ఒప్పించామని వివరించారు. "ఒక్కసారి మార్పు చేసి చూడండి.. మంచి జరుగుతుందో లేదో మీకే తెలుస్తుంది" అని సిద్ధిపేట ప్రజలను కోరారు. చైతన్యవంతులైన ప్రజలు ఆలోచించి 2029లో కాంగ్రెస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో సిద్ధిపేట రాజకీయాలు మరింత వేడెక్కాయి.

## 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తా: జీవన్‌రెడ్డి



జగిత్యాల: కాంగ్రెస్‌లో కొనసాగలేనంటూ జగిత్యాల కార్యకర్తలకు సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నెల 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని అందులో పేర్కొన్నారు. గత 20 నెలలుగా పార్టీలో మానసిక క్షోభకు గురవుతున్నానని తెలిపారు. అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగలేనని చెప్పారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశమై, అందరి సలహాలు, సూచనలతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని లేఖలో పేర్కొన్నారు. 'నా రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, మార్గదర్శనం కావాలి' అని కార్యకర్తలను కోరారు.

## హుక్కా సెంటర్‌పై దాడి..
## పోలీసుల అదుపులో 10 మంది



మైలార్‌దేవ్‌పల్లి: హైదరాబాద్‌లోని మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో నివాస ప్రాంతాల మధ్య అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడు మహ్మద్ తన్వీర్‌తో సహా 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. హుక్కా పాట్లతో పాటు ఆపిల్ ఫ్లేవర్, అల్ఫ్‌జ్, అల్ఫాఖర్ లాంటి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా హుక్కా సెంటర్లను నడపడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్ర నగర్ డీసీపీ హెచ్చరించారు.




## క్రీడలతో మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం

**: గవర్నర్ శివప్రసాద్ శుక్లా**

భువనగిరి: క్రీడలు వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు దేశ ప్రతిష్ఠను కూడా పెంచుతాయని తెలంగాణ గవర్నర్ శివప్రసాద్ శుక్లా అన్నారు. భువనగిరి పార్లమెంటు స్థాయిలో 'ప్రధాని ఖేల్ మహోత్సవ్' బహుమతి ప్రదానోత్సవం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు శరీర దారుఢ్యాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఖేలో ఇండియా కార్యక్రమాలు దేశ యువతలో స్ఫూర్తి నింపుతాయని తెలిపారు. కేంద్రమంత్రి బి.ఎల్. వర్మ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతోపాటు మణిపూర్‌లో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేసిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

## పేదలకు బుల్డోజర్లు.. ఒవైసీకి కంఫర్ట్ జోన్లా?
## .. హైడ్రా తీరుపై బండి సంజయ్ ఫైర్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ ఎంఐఎం పార్టీకి చెందిన నేతల ఆక్రమణలను మాత్రం వదిలేస్తోందని ధ్వజమెత్తారు. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓ న్యూస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ క్లిప్పింగ్ ను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన బండి సంజయ్ ఈ ఇంటర్వ్యూలో రంగనాథ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ గరీంబోంకో హటావోఒవైసీకి బచావో అన్న చందంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పేదల కోసం బఫర్ జోన్లు, ఒవైసీ కోసం కంఫర్ట్ జోన్లు, పేదలకు ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL), ఒవైసీకి మాత్రం ఫుల్ థ్యాంక్ లేవల్ అనేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ లాజిక్ ఎలా ఉందంటే విద్యార్థులు అక్రమ కాలేజీలో చదివితే అది సామాజిక కోణం, అదే పేదల ఇళ్లు మాత్రం ఆక్రమణలు అంటూ కూల్చేస్తున్నారని దుయ్యబట్టారు.

## ఇక్రిశాట్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు... తెలంగాణ పరువు తీయొద్దన్న హరీశ్ రావు

- ఇక్రిశాట్‌పై సీఎం రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన హరీశ్ రావు
- ఇక్రిశాట్‌ను అమెరికా సంస్థ అనడం సీఎం అవగాహన రాహిత్యమేనని విమర్శ
- ఇది ఏ ఒక్క దేశానికీ చెందింది కాదని, అంతర్జాతీయ పరిశోధనా సంస్థ అని వెల్లడి
- అవాస్తవాలు మాట్లాడి తెలంగాణ పరువు తీయవద్దని సీఎంకు హితవు
- ముఖ్యమంత్రి బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించిన హరీశ్ రావు




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాలుగా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఇక్రిశాట్ (ICRISAT)ను అమెరికాకు చెందిన సంస్థగా సీఎం అభివర్ణించడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కనీస వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడి తెలంగాణ పరువు తీయవద్దని హితవు పలికారు. ఈ మేరకు హరీశ్ రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 1972 నుంచి పటాన్‌చెరు కేంద్రంగా పనిచేస్తున్న ప్రపంచ ప్రఖ్యాత సంస్థ గురించి కూడా సీఎంకు స్పష్టత లేకపోవడం బాధాకరమన్నారు. ఇక్రిశాట్ అనేది ఏ ఒక్క దేశానికి చెందినది కాదని, అది ఒక స్వతంత్ర, లాభాపేక్ష లేని అంతర్జాతీయ పరిశోధనా సంస్థ అని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ సంస్థ ఏర్పాటులో ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (FAO), ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (UNDP) తో పాటు ప్రపంచ బ్యాంకు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. ప్రారంభ దశలో ఫోర్డ్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ల సహకారంతో పాటు, భారత ప్రభుత్వం సహా అనేక దేశాల మద్దతుతో నడుస్తున్న ఒక గ్లోబల్ వేదికను 'అమెరికా రీసెర్చ్ సెంటర్' అని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. కేవలం ఇక్రిశాట్ విషయంలోనే కాకుండా, నల్లమల సరిహద్దులు, కృష్ణాగోదావరి జలాలు, సుంకేసుల ప్రాజెక్టుల వంటి కీలక అంశాలపై కూడా సీఎంకు సరైన అవగాహన లేదని హరీశ్ రావు ఆరోపించారు. ఇంతటి ప్రాథమిక విషయాలు కూడా తెలియని స్థితిలో రాష్ట్రాన్ని నడపడం వల్ల తెలంగాణ ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి చేసే ప్రతి వ్యాఖ్య బాధ్యతాయుతంగా, వాస్తవాల ఆధారంగా ఉండాలని సూచించారు. ఇప్పటికైనా నోటికి ఏది వస్తే అది మాట్లాడటం మానుకుని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడటం అలవాటు చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు ఘాటుగా హితవు పలికారు.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..
## మారనున్న పాలిటెక్నిక్, ఐటీఐల భవిష్యత్



తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి విద్యలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (గతంలో ఐటీఐలు) తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏకీకరణతో నైపుణ్య శిక్షణకు సంబంధించిన అన్ని సంస్థలు ఒకే గొడుగు కిందకు రానున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 113 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు స్కిల్స్ వర్సిటీ కిందకు రానున్నాయి. దీని ఫలితంగా, ఇప్పటివరకు ఈ కాలేజీల సిలబస్, పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) రద్దు కానుంది. అదేవిధంగా, కార్మిక శాఖ పరిధిలోని 63 ప్రభుత్వ ఏటీసీలు, 219 ప్రైవేట్ ఐటీఐలు కూడా ఈ వర్సిటీ పరిధిలోకి చేరనున్నాయి. ఈ సమగ్ర మార్పుల్లో భాగంగా, ఇప్పటివరకు పరిశ్రమల శాఖ కింద ఉన్న స్కిల్స్ యూనివర్సిటీని ఇకపై ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ విద్యా కమిషన్ అందించిన 'విద్యా విధానం 2026' సిఫార్సులకు అనుగుణంగా ఈ ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు, ఇంటర్మీడియట్ స్థాయిలోని ఒకేషనల్ కోర్సులు, విదేశాల్లో ఉపాధి కల్పించే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టీఓఎమ్‌సీఓఎమ్) కూడా ఈ నూతన వ్యవస్థలో భాగం కానున్నాయి. ఈ సంస్కరణల ద్వారా సిలబస్ రూపకల్పనలో పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది ఆగస్టులో పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (PPP) విధానంలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి దీనికి ఛాన్స్‌లర్‌గా వ్యవహరిస్తుండగా, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ వర్సిటీ కోసం, ఫ్యూచర్ సిటీలో 58 ఎకరాల్లో శాశ్వత ప్రాంగణాన్ని నిర్మిస్తున్నారు. ఈ అధికార బదిలీ, విలీన ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్పులతో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.

## 'తెలంగాణ బిల్డింగ్ రూల్స్'లో ప్రభుత్వం కీలక సవరణలు



హైదరాబాద్: 'తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012'కి సంబంధించి ప్రభుత్వం కీలక సవరణలు చేసింది. ఈ మేరకు జీవో జారీ చేసింది. దీని ప్రకారం.. 21 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తుతో నిర్మించనున్న వాటిని హైరైజ్ భవనాలుగా గుర్తించనున్నారు. 750 చ.మీ నుంచి 2000 చ.మీలు ఉన్న స్థలంలో 1821 మీటర్ల భవనాలు నిర్మించాలంటే టీడీఆర్ వినియోగం తప్పనిసరి. నాన్ హైరైజ్ భవనాలకు టీడీఆర్ వినియోగంతో సెట్‌బ్యాక్ సడలింపు ఇచ్చారు. ఇప్పటి వరకు 2012లో జారీ చేసిన ఉత్తర్వులోని నిబంధనలు అమల్లో ఉన్నాయి. వాటికి కాలానుగుణంగా ప్రభుత్వాలు సవరణలు చేశాయి. వీటివల్ల లాభంతో పాటు సమస్యలూ వస్తున్నాయని ప్రణాళిక విభాగం భావించింది. అదే సమయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ 2016లో నిర్మాణ అనుమతులకు కొత్త చట్టాలను తీసుకొచ్చింది. వాటిని దృష్టిలో ఉంచుకుని కొత్త నిబంధనలను ప్రభుత్వం తీసుకొచ్చింది.

## కారుణ్య నియామకాలతో కుటుంబాలకు భరోసా : మంత్రి సీతక్క

కొత్తగూడ: ప్రభుత్వ ఉద్యోగి అకాల మరణం కుటుంబాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతుందని, అలాంటి సమయంలో బాధిత కుటుంబాలను ఒంటరిగా విడిచిపెట్టకుండా ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం కొత్తగూడ మండల కేంద్రంలోని ఐటీడీఏ అతిథి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క కారుణ్య నియామక పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఐటీడీఏ పరిధిలో వివిధ కారణాలతో మరణించిన 17 మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు గాను ప్రాథమికంగా ముగ్గురు లబ్ధిదారులకు మంత్రి స్వయంగా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..కుటుంబానికి ఆధారం కోల్పోయిన సమయంలో ఉపాధి కల్పించడం ద్వారా వారికి భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఈ రోజు నియామక పత్రాలు పొందిన వారు తమ కుటుంబాలకు కొత్త ఆశను తీసుకువచ్చారని కొత్తగా విధుల్లో చేరబోతున్న వారు నిబద్ధత, నిజాయితీతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవ అందించడంతో పాటు తమ కుటుంబాలకు గౌరవం తీసుకురావాలని సూచించారు.

# మమత కంచుకోట.. ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా!




పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలోనే భవానీపూర్ నియోజకవర్గం అందరి దృష్టి ఆకర్షిస్తోంది. కారణం.. ఇది ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సొంత నియోజకవర్గం కావడమే. పైగా ఈసారి భాజపా నేత సువేందు అధికారి సైతం ఇక్కడినుంచే పోటీకి దిగనున్నారు. ప్రస్తుతం దీదీకి కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా. స్వాతంత్ర్యం అనంతరం దశాబ్దాలపాటు ఇక్కడ హస్తం పార్టీ నేతలదే పైచేయి. బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే.. భవానీపూర్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. మరోసారి స్వతంత్ర అభ్యర్థిగానూ ఆయన విజయం సాధించడం గమనార్హం. మీరాదత్తా గుప్తా, రథిన్ తాలుక్‌దార్ వంటి కాంగ్రెస్ దిగ్గజాలు కూడా ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. అనేక సంవత్సరాలపాటు కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగిన ఈ నియోజకవర్గం పేరును కాళీఘాట్‌గా మార్చారు. 1969 ఎన్నికల్లో సీపీఎం నేత సాధన్ గుప్తా గెలుపొందారు. 1972లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం.. ఈ నియోజకవర్గం కనుమరుగైపోయింది. మళ్లీ 2011లో డీలిమిటేషన్ తర్వాత భవానీపూర్ పేరిట పునర్వ్యవస్థీకరించారు. అదే ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లోనే బెంగాల్‌లో వామపక్షాల సుదీర్ఘ పాలనకు తెరదించుతూ టీఎంసీ అధికారంలోకి వచ్చింది. భవానీపూర్‌లో దీదీ విశ్వాసపాత్రుడు సుబ్రతా బక్షీ గెలుపొందారు. కొద్దికాలానికే బక్షీ ఆ సీటును ఖాళీ చేశారు. అప్పటికే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మమతా బెనర్జీ.. ఇదే స్థానం నుంచి ఉప ఎన్నికలో గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు. అప్పటినుంచి ఈ సీటు తృణమూల్ చేతుల్లోనే ఉంది. 2016లోనూ మమత 65 వేలకుపైగా ఓట్లతో విజయం సాధించారు. 2021లో నందిగ్రామ్ నుంచి పోటీ చేసిన మమత.. సువేందు అధికారి చేతిలో 1,956 ఓట్ల తేడాతో ఓడిపోయారు. భవానీపూర్‌లో మాత్రం టీఎంసీ అభ్యర్థి సోవందేబ్ ఛటోపాధ్యాయ విజయం సాధించారు. ఆయన రాజీనామా చేసిన అనంతరం జరిగిన ఉప ఎన్నికలో 58 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో మమతా విజయం సాధించారు. దక్షిణ కోల్‌కతాలోని ఈ అసెంబ్లీ నియోజకవర్గం సామాజిక వైవిధ్యానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. ఇక్కడ బెంగాలీ మధ్యతరగతి కుటుంబాలతోపాటు పెద్ద సంఖ్యలో హిందీ మాట్లాడే వ్యాపార వర్గాలూ ఉన్నాయి. ఓటర్లలో బెంగాలీ హిందువులు దాదాపు 42 శాతం, బెంగాలీయేతర హిందువులు 34 శాతం, ముస్లింలు 24 శాతం ఉన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో సీఎం మమతా బెనర్జీ వ్యక్తిగత రాజకీయ అనుబంధాన్ని ఏర్పరచుకున్నారని, స్థానిక సామాజిక వాతావరణం ఆమెకు అనుకూలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# భారత్ చేరిన అమెరికా ఎల్‌పీజీ నౌక



పశ్చిమాసియా సంక్షోభం కారణంగా చమురు, ఎల్‌పీజీ సరఫరా గొలుసుకు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశంలో ముఖ్యంగా ఎల్‌పీజీకి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఊరటనిచ్చేలా అమెరికాకు చెందిన ఎల్‌పీజీ నౌక భారత్‌కు చేరింది. అమెరికాలోని టెక్సాస్ నుంచి బయల్దేరిన పయనీర్ నౌక ఎల్‌పీజీ లోడ్‌తో కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు ఆదివారం చేరుకుంది. దీంతోపాటు రష్యాకు చెందిన చమురు నౌక కూడా దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించింది. అక్వాటైటాన్ పేరుతో రష్యా నుంచి వచ్చిన ఈ నౌక శనివారమే మంగళూరు పోర్టును చేరినట్లు పలు ఆంగ్ల మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు సంక్షోభాన్ని తగ్గించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్చి 12 నాటికి రష్యా నౌకల్లో లోడ్ చేసిన చమురును కొనుగోలు చేయొచ్చని అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో రష్యా నౌక భారత్‌కు చేరుకోవడం గమనార్హం.

# సైనికులకు తోడ్పాటు..బాలుడిని వరించిన లాటరీ

ఫిరోజ్‌పూర్: పంజాబ్‌కు చెందిన బాలుడు శ్రావణ్ సింగ్ గుర్తున్నాడా? 'ఆపరేషన్ సిందూర్' సమయంలో మన సైనికులకు మంచినీరు, పాలు, టీ, లస్సీ వంటివి అందిస్తూ తనవంతు తోడ్పాటు అందించాడు. అతడు మరోసారి వార్తల్లో నిలిచాడు. కారణం.. ఏడు రూపాయలు పెట్టి కొన్న ఓ లాటరీలో రూ.5 లక్షలు గెలుచుకోవడమే. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ''ఓ పని మీద ఊరికి వెళ్లి తిరిగి వస్తుండగా.. లాటరీ టికెట్లు కొందామని శ్రావణ్ సింగ్ కోరాడు. దీంతో రూ.350 పెట్టి 50 టికెట్లు కొన్నాం. అందులో ఒక టికెట్‌పై రూ.5 లక్షలు గెలుచుకున్నాం. ఈ డబ్బును అతడి భవిష్యత్తు కోసమే వినియోగిస్తాను'' అని బాలుడి తండ్రి సోనా సింగ్ తెలిపారు. మంచి మనసున్న బాలుడని, ఎంతో నిజాయతీతో సేవ చేశాడని.. అందుకే దేవుడు కరుణించాడని లాటరీ విక్రేత చెప్పారు. ఫిరోజ్‌పూర్ జిల్లాలో తారావాలీ అనే గ్రామం అంతర్జాతీయ సరిహద్దుకు 2 కి.మీ. దూరంలో ఉంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో అక్కడ భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. పాకిస్థాన్‌తో భారత సైన్యం తలపడుతున్న వేళ.. అదే గ్రామానికి చెందిన శ్రావణ్ సింగ్ సైనికులకు తోడుగా నిలిచాడు. అప్పట్లో బాలుడి సేవలను ప్రశంసించిన సైనికాధికారులు.. అతడి చదువుకయ్యే ఖర్చులను భరించేందుకు ముందుకొచ్చారు. గతేడాది డిసెంబరులో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కారం అందుకున్నాడు.




## పుదుచ్చేరి సీఎం రంగసామి
# ఆస్తుల విలువ రూ.27.99 కోట్లు



చెన్నై(ఆర్కేనగర్): పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామికి రూ.27.99 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. 12 గ్రాముల బంగారు ఉంగరం, 12 గ్రాముల ముత్యాలహారం, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు ఉన్నట్లు పేర్కొన్నారు. తట్టంచావడి మార్కెట్ ప్రాంతంలో రూ.8కోట్ల విలువైన స్థలం, రెండు ఇళ్లు ఉన్నట్లు తెలియజేశారు. ఇవి పూర్వీకుల ఆస్తులు. రూ.28 లక్షల పెట్టుబడులు ఉన్నాయని, వ్యక్తిగతంగా ఒకరికి రూ.30లక్షలు, మరొకరికి రూ.5లక్షలు అప్పు చెల్లించాలని అఫిడవిట్‌లో పొందుపరిచారు. రంగసామి తట్టంచావడి, మంగళం నియోజకవర్గాలలో పోటీ చేసేందుకు నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల దాఖలుకు సోమవారం(23వ తేదీ) చివరి రోజుకాగా.. ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది.

# ట్రంప్ చిత్రంతో బంగారు స్మారక నాణెం!



అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా రూపొందించనున్న స్మారక నాణెంపై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రం కనిపించనున్నట్లు తెలుస్తోంది. 24 క్యారెట్ల బంగారంతో తయారు చేయనున్న ఈ నాణెంపై.. ఓవల్ ఆఫీస్‌లోని రెజల్యూట్ డెస్క్‌పై చేతులు పెట్టిన పోజులో ఉన్న ట్రంప్ చిత్రాన్ని ముద్రించనున్నట్లు సమాచారం. జీవించి ఉన్నప్పుడే ఓ అధ్యక్షుడు నాణెంపై కనిపించనుండటం ఇది రెండోసారి. 1926లో అమెరికా స్వాతంత్ర్యానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ముద్రించిన స్మారక నాణెంపై అప్పటి అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్.. కనిపించారు. 'యూఎస్ కమిషన్ ఆన్ ఫైన్ఆర్ట్స్' ఇటీవల నిర్వహించిన ఓ సమావేశంలో ప్రతిపాదిత స్మారక నాణెం డిజైన్‌ను ఆమోదించింది. తుది కొలతలు ఖరారైన తర్వాత ముద్రించనున్నారు. ''250వ వార్షికోత్సవం వేళ మన దేశంతోపాటు ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీకగా నిలిచే ఈ నాణెలను రూపొందించడం ఆనందంగా ఉంది. ఈ కాయిన్‌పై కనిపించేందుకు ట్రంప్‌ను మించినవారు లేరు'' అని యూఎస్ ట్రెజరర్ బ్రాండన్ బీచ్ ఓ వార్తాసంస్థకు తెలిపారు. స్థానిక చట్టాల ప్రకారం.. జీవించి ఉన్న ఏ అధ్యక్షుడూ యూఎస్ కరెన్సీపై కనిపించకూడదు. కానీ.. ప్రతిపాదిత స్మారక నాణెం చలామణిలో ఉన్న కరెన్సీకి వేరుగా ఉంటుందని, ఫైనల్ డిజైన్ ఎంపిక, దాని ముద్రణకు ఆదేశాలు ఇవ్వడంపై పూర్తి విచక్షణాధికారం ట్రెజరీ సెక్రటరీకే ఉంటుందని బీచ్ చెప్పారు. మరోవైపు.. ఈ ప్రతిపాదనను డెమోక్రాట్లు తప్పుపడుతున్నారు. దేశ విలువలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. ''రాజులు, నియంతల వంటివారే తమ చిత్రాలను నాణేలపై ముద్రించుకుంటారు. ప్రజాస్వామ్య నేతలు కాదు'' కాని ఓరెగన్ సెనేటర్ జెఫ్ మెర్క్‌లీ విమర్శించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్' పేర్కొంది.

## అరుణాచలంలో...
# లడ్డూ ప్రసాదం తయారీ నిలిపివేత



తిరువణ్ణామలై: గ్యాస్ కొరత కారణంగా తిరువణ్ణామలైలోని ప్రసిద్ధ అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో లడ్డూ ప్రసాదం తయారీని నిలిపివేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు గత మూడేళ్ల నుంచి ఉచితంగా లడ్డూ ప్రసాదం అందజేస్తున్నారు. లడ్డూలతో పాటు మురుకులు, అతిరసలు తయారు చేసి విక్రయిస్తున్నారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడటంతో అధికారులు లడ్డూ తయారీని నిలిపివేశారు. అయితే, భక్తుల నుంచి డిమాండ్ రావడంతో ప్రత్యామ్నాయంగా కట్టెల పొయ్యిపై లడ్డూలు తయారు చేయించాలని నిర్ణయించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనుమతి రాగానే కట్టెల పొయ్యిలపై తయారు చేసి భక్తులకు పంపిణీ చేయనున్నారు.

# వార్ ఎఫెక్ట్: ఇంధన ధరలను మళ్లీ పెంచిన శ్రీలంక



కొలంబో: పశ్చిమాసియా సంక్షోభం కారణంగా శ్రీలంక ఇంధన ధరలను మరోసారి భారీగా పెంచింది. ఒకేసారి 25% పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడంతో ఈ పెంపుదల చేపట్టింది. వారం రోజుల వ్యవధిలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఇది రెండోసారి. ధరల సవరణ అనంతరం శ్రీలంకలో లీటర్ పెట్రోల్ ధర రూ.317 నుంచి రూ.398కి చేరింది. డీజిల్ ధర లీటరుకు రూ.79 పెంచడంతో రూ.382కు చేరింది. గత వారంలోనూ శ్రీలంక ప్రభుత్వం రిటైల్ ఇంధన ధరలను 8% పెంచింది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్, ఇంధన వినియోగం విషయంలో పొదుపు పాటించాలని పౌరులకు శ్రీలంక సర్కారు సూచించింది. 'ప్రపంచ మార్కెట్లు ఇంధన కొరతను ఎదుర్కొంటున్నాయి. ఇంధనాన్ని, విద్యుత్‌ను కనిష్ఠ పరిమితిలో వాడండి' అని శ్రీలంక మంత్రి నలింద జయతిస్స విజ్ఞప్తి చేశారు. ఇంధన కృత్రిమ కొరత సృష్టించొద్దని హెచ్చరించారు. తాజా పెరుగుదలతో ఇంధన వినియోగం 15%, 20% మేర తగ్గుతుందని ఓ అధికారి తెలిపారు. ఇంధన కొరతను అధిగమించడం కోసం ఇప్పటికే పరిమిత స్థాయిలో ఇంధన పంపిణీ (ఫ్యూయల్ రేషనింగ్) విధానాన్ని శ్రీలంక ప్రభుత్వం తీసుకొచ్చింది. క్యూఆర్ కోడ్ సాయంతో కార్లకు వారానికి 15 లీటర్లు, బస్సులకు 60 లీటర్లు ఇంధనాన్ని మాత్రమే పంపిణీ చేస్తోంది.

## వార్ ఎఫెక్ట్.. కెన్యా తీరంలో
# చిక్కుకుపోయిన వేలాది లగ్జరీ కార్లు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తున్న ఇరాన్.. హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపైనా ఆంక్షలు కొనసాగిస్తోంది. దీంతో.. అనేక ఇంధన, సరకు రవాణా నౌకలు నిలిచిపోతున్నాయి. ఈ క్రమంలోనే జపాన్ నుంచి దుబాయ్‌కు చేరాల్సిన వేలాది లగ్జరీ కార్లు కెన్యా తీరంలో చిక్కుకుపోయాయి. ఇప్పటికే దాదాపు నాలుగు వేల కార్లు ఇక్కడ చిక్కుకుపోగా.. వచ్చే వారం మరో ఐదు వేల వాహనాలు రానున్నాయి. పోర్షే సహా ఆయా కంపెనీల లగ్జరీ కార్ల లోడ్‌తో జపాన్‌లోని యోకోహామా నుంచి గత నెలలో నౌకలు బయల్దేరాయి. దుబాయ్‌లోని జాబెల్ అలీ పోర్ట్‌లో వాటిని డెలివరీ చేయాల్సి ఉంది. అయితే, అంతలోనే యుద్ధం మొదలైంది. మార్చి 1న జాబెల్ అలీ పోర్ట్‌పైనా దాడులు జరిగాయి. దీంతో 4,000 కార్లతో అక్కడికి వెళ్లాల్సిన ఓ నౌకను కెన్యాలోని లాము పోర్ట్‌కు మళ్లించారు. ఇక్కడి గిడ్డంగుల్లో ఆ కార్లను పార్క్ చేశారు. వచ్చే వారం మరో 5,000 వాహనాలతో కూడిన నౌక రానున్నట్లు నౌకాశ్రయ అధికారులు తెలిపారు. పశ్చిమాసియాలో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకునేవరకు ఈ కార్లను ఇక్కడే ఉంచనున్నట్లు చెప్పారు.

# ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను మేం కాపాడతాం: ఇరాన్



వనరుల పరంగా ఎంతో కీలక దీవి అయిన గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఇరాన్ అధికారి తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను రక్షించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. 'గ్రీన్‌లాండ్‌ను అప్పగించాలని ట్రంప్ మొదట ఐరోపాను బెదిరించారు. ఆ తర్వాత వారిని బతిమలాడుకున్నారు. ఇప్పుడు ఏకంగా దాన్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఐరోపాకు నేను చెప్పేది ఒకటే.. మీరు మీ గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేకపోతే మా సాయం అడగండి. మేము ఆయన నుంచి దాన్ని కాపాడతాం. అందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. అయితే, ఆ దీవికి ఎలా రక్షణ కల్పిస్తారనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధించిన తర్వాత గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ఈ ఏడాది ప్రారంభంలో ట్రంప్ చేసిన ప్రకటనలు సంచలనం సృష్టించాయి. దీనిపై చర్చలు జరపాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. అయితే, డెన్మార్క్ అందుకు నిరాకరించడంతో దీనిపై ఎలాంటి ఒప్పందం కుదరలేదు. గ్రీన్‌లాండ్ విషయంలో తనకు మద్దతు తెలపని ఈయూ దేశాలపై అదనపు సుంకాలను విధిస్తానని తొలుత బెదిరించిన ఆయన.. తర్వాత వెనక్కి తగ్గారు. ఇరాన్ అధికారి వ్యాఖ్యలతో తాజాగా ఈ అంశం మరోసారి చర్చకు వచ్చింది.




## ఇరాన్ చమురు
# మనకు దక్కుతుందా?



పశ్చిమాసియా ఘర్షణల కారణంగా, సరఫరాలకు ఆటంకం ఏర్పడి బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 112 డాలర్లను మించింది. యుద్ధానికి ముందు ఇది సగటున 70 డాలర్లుగా ఉండేది. ప్రపంచ దేశాలకు చమురు ధరల సెగ తాకడంతో, ఇప్పటికే సరఫరాకు సిద్ధం చేసిన ఇరాన్ చమురును ఏప్రిల్ 19 వరకు విక్రయించుకోవచ్చని అమెరికా సడలింపు ఇచ్చింది. దాదాపు 100-140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురు సరఫరాకు సిద్ధంగా ఉందని అంచనా. ఈ నేపథ్యంలోనే ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లను తిరిగి ప్రారంభించాలని మన దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు యోచిస్తున్నాయని.. ఇందుకోసం ప్రభుత్వ మార్గదర్శకత్వం, చెల్లింపు నిబంధనలపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్నాయని వార్తా సంస్థ రాయిటర్స్ పేర్కొంది. అమెరికా సడలింపుల నడుమ, ఇరాన్ నుంచి ముడిచమురు తిరిగి కొనుగోలు చేయడానికి ఆసియా దేశాలు సిద్ధమవుతున్నాయి. కానీ ఇంతకుముందు నుంచే ఇరాన్‌పై ఆంక్షలు అమలవుతున్నందున, తమ ప్రభుత్వాలు అమెరికా నుంచి స్పష్టమైన ఆదేశాల కోసం కంపెనీలు వేచి చూస్తున్నాయని చెబుతున్నాయి. చెల్లింపు విధానాలు, బీమా కవరేజీపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలుకు కూడా అమెరికా అనుమతులు ఇచ్చిన సంగతి విదితమే.

*** అదనపు నిల్వలు లేవు: ఇరాన్**

పశ్చిమాసియా, ఆసియా జలాల్లోని ట్యాంకర్లలో ప్రస్తుతం 100-140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురు నిల్వ ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రపంచ మార్కెట్లకు సరఫరా చేయడానికి తమ వద్ద అదనపు ముడి చమురు అందుబాటులో లేదని ఇరాన్ పేర్కొంది. ఇరాన్ చమురుపై అమెరికా ఆర్థిక మంత్రి వ్యాఖ్యలు, ప్రధానంగా కొనుగోలుదార్లకు భరోసా ఇవ్వడానికే ఉద్దేశించినట్లు కనిపిస్తున్నాయని ఇరాన్ చమురు మంత్రిత్వ శాఖ ప్రతినిధి సమన్ ఘోద్దూసీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

*** మనకు మరింత ముఖ్యం**

జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో 200 రోజులకు సరిపడా, అత్యవసర చమురు నిల్వలుంటే, మనదేశంలో 70-80 రోజులకు సరిపడా వ్యూహాత్మక నిల్వలున్నాయని ప్రభుత్వం ప్రకటిస్తోంది. యుద్ధం ప్రారంభమయ్యాక, చమురు సరఫరాకు ఆటంకాలు పెరిగి, మనదేశంలో ఎల్‌పీజీ ఎల్ఎన్‌జీ సరఫరాలపై ఆంక్షలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇరాన్ ముడి చమురుపై భారత్‌కు ఆసక్తి పెరిగింది. రష్యా చమురుపై ఆంక్షలను అమెరికా సడలించగానే, అక్కడనుంచి ముడి చమురు కొనుగోలు చేయడానికి భారతీయ రిఫైనరీలు త్వరగా చర్యలు తీసుకోవడం గమనార్హం.

*** పశ్చిమాసియా చమురు రవాణా తేలిక**

ఆసియా దేశాల ముడి చమురు దిగుమతుల్లో సుమారు 60% పశ్చిమాసియా నుంచే రవాణా అవుతుంది. ఇందుకు కీలక నౌకా రవాణా మార్గమైన హర్మ్యూజ్ జలసంధిలో ఆటంకాలు ఏర్పడటం, సమస్యను పెంచింది.

# ఐడీబీఐ బ్యాంక్ విక్రయానికి బ్రేక్..
## ప్లాన్-బికి ప్రభుత్వం రెడీ!

దిల్లీ: ఐడీబీఐ బ్యాంక్‌లో (IDBI Bank) వాటా విక్రయ ప్రక్రియకు బ్రేక్ పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. దీంతో ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో (OFS) పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను పెంచేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఐడీబీఐ పబ్లిక్ షేర్‌హోల్డింగ్ 5.29 శాతం మాత్రమే ఉంది. ఈ మొత్తాన్ని పెంచడం ద్వారా మెరుగైన వాల్యూయేషన్‌ను పెంచవచ్చన్నది ప్రభుత్వ ఆలోచనగా ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఐడీబీఐలో ఎల్ఐసీకి 49.24 శాతం, ప్రభుత్వానికి 45.48 శాతం చొప్పున వాటా ఉంది. కేంద్రం, ఎల్ఐసీ కలిసి 60.72 శాతం వాటా విక్రయించేందుకు బిడ్లు ఆహ్వానించాయి. అయితే, రిజర్వ్ ధర కంటే తక్కువ ధర రావడంతో ప్రభుత్వం విక్రయ ప్రణాళికలను తాత్కాలికంగా పక్కనపెట్టింది. తక్కువ ఫ్రీఫ్లోట్ (పబ్లిక్ షేర్ హోల్డింగ్) వల్ల ఫెయిర్ మార్కెట్ వాల్యూ పొందడం కష్టమని గ్రహించిన ప్రభుత్వం.. 10 లేదా 15 శాతం మేర వాటా విక్రయించడం వల్ల మెరుగైన మార్కెట్ ప్రైస్‌ను కనుగొనవచ్చని భావిస్తోంది. ఒకటి, రెండు దశల్లో వాటాల విక్రయం అనంతరం వ్యూహాత్మక వాటాల విక్రయం చేపట్టాలన్నది ప్రభుత్వ యోచనగా ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ముందుకీ వెనక్కీ: ఐడీబీఐ బ్యాంక్ విక్రయ ప్రక్రియ పదేళ్లుగా నానుతూ వస్తోంది. ఈ బ్యాంక్‌ను ప్రైవేటీకరించనున్నట్లు 2016లో నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. వాల్యూయేషన్ కారణంగా అప్పట్లో దీనికి బ్రేక్ పడింది. 2019లో ఎల్ఐసీకి 51 శాతం వాటా విక్రయించింది. దీంతో ఆర్‌బీఐ




ప్రైవేటురంగ బ్యాంకుగా ఐడీబీఐని గుర్తించింది. 2021 మే నెలలో బ్యాంకును ప్రైవేటీకరించేందుకు క్యాబినెట్ కమిటీ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. దీంతో వ్యూహాత్మక వాటాల విక్రయం మరోసారి పట్టలెక్కింది. రిజర్వ్ ధర కంటే తక్కువ ధరకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్, ఫెయిర్‌ఫాక్స్ ఇండియా నుంచి బిడ్లు దాఖలు కావడంతో ప్రస్తుతానికి విక్రయ ప్రక్రియను ప్రభుత్వం పక్కనపెట్టి.. ప్లాన్‌బికి సిద్ధమవుతోంది.

## నగదు ₹10 లక్షలు దాటితే PAN..
# ఏప్రిల్ 1 నుంచి కొత్త పరిమితులు

ఆర్థిక లావాదేవీల్లో నిత్యం ఉపయోగించే శాశ్వత గుర్తింపు సంఖ్య (PAN)కు సంబంధించి కేంద్రం కొన్ని మార్పులు చేపట్టింది. లావాదేవీ పరిమితులను గణనీయంగా పెంచింది. కొత్త ఆదాయపు పన్ను చట్టం2025 అమలులో భాగంగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఆదాయపు పన్ను నిబంధనలు 2026ను నోటిఫై చేసింది. ఇందులో భాగంగా పాన్‌కు సంబంధించిన లావాదేవీ పరిమితులను సవరించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి.

**ఇక ₹10 లక్షలు దాటితే**

ఒక ఆర్థిక సంవత్సరంలో ఖాతాలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు ఒకేసారి లేదా విడతల వారీగా జమ చేసినా, ఉపసంహరించుకున్నా పాన్ వివరాలు ఇకపై ఇవ్వాల్సి ఉంటుంది. ఒకటే బ్యాంకు లేదా వేర్వేరు బ్యాంకుల్లో జరిగినా ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రస్తుతం ఒక రోజులో రూ.50 వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు.

**స్థిరాస్తి కొనుగోళ్లు**




ఇళ్లు, స్థలాల కొనుగోలు, అమ్మకం, బహుమతి లేదా ఉమ్మడి డెవలప్‌మెంట్ ఒప్పందాల విషయంలో లావాదేవీ విలువ రూ.20లక్షలు దాటితే ఇకపై పాన్ తప్పనిసరి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. స్థిరాస్తి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ పరిమితిని రెట్టింపు చేయడం గమనార్హం.

**వాహనాల కొనుగోలు**

ద్విచక్ర వాహనం సహా ఏ మోటారు వాహనమైనా, దాని ధర రూ.5 లక్షలు మించితే కొనుగోలుదారుడు పాన్ సమర్పించాల్సి ఉంటుంది. పాత చట్టంలో ద్విచక్ర వాహనాలకు ఈ నిబంధన లేదు. కార్లకు, ఇతర మోటారు వాహనాలకు ధరతో సంబంధం లేకుండా పాన్ సమర్పించాల్సి వచ్చేది. కొత్తగా రూ.5 లక్షల పరిమితిని తీసుకొచ్చారు.

**హోటళ్లు, ఈవెంట్లు, రెస్టారెంట్ బిల్లులు**

హోటళ్లు లేదా రెస్టారెంట్ల బిల్లులు, కన్వెన్షన్ సెంటర్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చేసే చెల్లింపులు రూ.లక్ష దాటితే ఇకపై పాన్ సమర్పించాలి. ప్రస్తుతం హోటల్, రెస్టారంట్ బిల్లు రూ.50 వేలు దాటితే పాన్ ఇవ్వాల్సి వస్తోంది. ఈ మొత్తాన్ని రెట్టింపు చేశారు.

**బీమా ప్రీమియం**

ప్రస్తుతం బీమా పాలసీ కొనుగోలు సమయంలో వార్షిక ప్రీమియం రూ.50వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు. ఇకపై ప్రతి పాలసీకి పాన్ సమర్పించడం తప్పనిసరి.

# మొత్తం మనోళ్లే.. తొలిసారి ఐపీఎల్‌లో అందరూ భారత కెప్టెన్లే

పేరుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంటాం కానీ.. అందులో విదేశీ ఆటగాళ్ల పాత్ర ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తుది జట్టులో ఉండేది నలుగురే అయినా.. విదేశీ క్రికెటర్ల ప్రభావం ఎక్కువే. కెప్టెన్లుగా పలు జట్లను వాళ్లు నడిపించారు కూడా. కానీ 18 సీజన్ల నుంచి ఉన్న ఒరవడికి ఈసారి మాత్రం తెరపడింది. లీగ్‌లో పది జట్లకూ భారత ఆటగాళ్లే సారథ్యం వహించబోతున్నారు. తొలిసారి ఐపీఎల్‌లో ఈ చిత్రాన్ని చూడబోతున్నాం. మరి కెప్టెన్లుగా ఈ పది మంది క్రికెటర్ల చరిత్రేంటి.. ఈసారి వారిపై ఉన్న అంచనాలేంటి.. ఓసారి చూద్దాం పదండి.

2008లో ఎనిమిది జట్లతో ఐపీఎల్ ఆరంభమైనపుడు ఏడు జట్లను భారత ఆటగాళ్లే నడిపించారు కానీ.. రాజస్థాన్ రాయల్స్ మాత్రం షేన్ వార్న్ సారథ్యంలో బరిలోకి దిగింది. ఈ దివంగత, దిగ్గజ ఆటగాడి సారథ్యంలో రాయల్స్ కప్పు కూడా గెలిచి ఆశ్చర్యపరిచింది. ఆ సీజన్ మధ్యలో డెక్కన్ ఛార్జర్స్ సారథ్యాన్ని వీవీఎస్ లక్ష్మణ్ నుంచి ఆడమ్ గిల్‌క్రిస్ట్ అందుకున్నాడు. తర్వాతి 17 సీజన్లలో విదేశీ కెప్టెన్ లేకుండా ఐపీఎల్ ఎప్పుడూ లేదు. షేన్ వార్న్, షేన్ వాట్సన్‌ల తర్వాత రాజస్థాన్ రాయల్స్ భారత కెప్టెన్ల వైపు మళ్లింది. కానీ డెక్కన్ ఛార్జర్స్ వారసత్వాన్ని కొనసాగిస్తూ.. తర్వాత హైదరాబాద్ ఫ్రాంఛైజీని దక్కించుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ సైతం విదేశీ కెప్టెన్లకే ప్రాధాన్యమిచ్చింది. సంగక్కర, కామెరూన్ వైట్, డారెన్ సామి, డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్సన్, మార్‌క్రమ్ జట్టును నడిపించారు. తర్వాత ప్యాట్ కమిన్స్ పగ్గాలు అందుకున్నాడు. గత రెండు సీజన్లలో ఐపీఎల్‌లో ఉన్న ఏకైక విదేశీ కెప్టెన్ కమిన్సే. కానీ ఈసారి గాయం వల్ల అతను ఐపీఎల్ ఆడడంపై అనిశ్చితి నెలకొంది. అతను వచ్చే వరకు తాత్కాలిక సారథిగా ఇషాన్ కిషన్ వ్యవహరించబోతున్నాడు. దీంతో ఈసారి ఐపీఎల్‌లో అందరూ భారత కెప్టెన్లనే చూడబోతున్నాం.

**ఇషాన్ వచ్చాడు..**

సన్‌రైజర్స్ తాత్కాలిక సారథిగా ఇషాన్‌ను నియమించడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేసి ఉండొచ్చు. ఎందుకంటే ఓపెనర్ అభిషేక్ శర్మను గతంలోనే కెప్టెన్‌ను చేస్తారని వార్తలు వచ్చాయి. అతను జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. అయినా ఇషాన్‌నే ఎంచుకుంది యాజమాన్యం. ఇందుకు ప్రధాన కారణం.. ఈ సీజన్ ముస్తాక్ అలీ టోర్నీలో అతడి ప్రదర్శనే. పెద్దగా



అంచనాల్లేని ఝార్ఖండ్ జట్టు టైటిల్ గెలిచిందంటే అందుకు ప్రధాన కారణం ఇషానే. బ్యాటర్‌గా ముందుండి నడిపిస్తూ, స్ఫూర్తిమంతమైన సారథ్యంతో జట్టును ఆ టోర్నీలో విజేతగా నిలిపాడు. తర్వాత టీ20 ప్రపంచకప్‌లోనూ బ్యాటర్‌గా అదరగొట్టడంతో సన్‌రైజర్స్‌కు అతడిపై గురి కుదిరి సారథ్య బాధ్యతలు అప్పగించింది. 27 ఏళ్ల ఇషాన్.. ఐపీఎల్‌లో తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు. కమిన్స్ కోలుకోకుంటే.. సీజన్ మొత్తం అతనే జట్టును నడిపించడం లాంఛనమే.

**రియాన్ పరాగ్‌పై దృష్టి**

ఈసారి ఇషాన్‌ను మించి ఓ కొత్త కెప్టెన్ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. అతనే.. రియాన్ పరాగ్. చాలా ఏళ్లు ఈ జట్టును నడిపించిన సంజు శాంసన్ చెన్నై సూపర్‌కింగ్స్‌కు వెళ్లిపోవడంతో పరాగ్‌కు బాధ్యతలు అప్పగించింది యాజమాన్యం. నిజానికి పరాగ్‌కు కెప్టెన్‌గా ఇప్పటికే ఒక సీజన్ అనుభవముంది. నిరుడు సంజు శాంసన్ పూర్తి ఫిట్‌గా లేకపోవడంతో ఇంపాక్ట్ ప్లేయర్‌గానే ఎక్కువ మ్యాచ్‌లు ఆడాడు. దీంతో పరాగ్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. కానీ అతడి సారథ్యంలో 8 మ్యాచ్‌లు ఆడిన రాయల్స్ రెండే గెలిచింది. రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ లాంటి ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ.. వారిని కాదని పరాగ్‌నే రాయల్స్ కెప్టెన్‌గా ఎంచుకోవడం ఆశ్చర్యం కలిగించేదే. మరి ఫ్రాంఛైజీ నమ్మకాన్ని అతను ఏమేర నిలబెడతాడో చూడాలి.

**పాండ్య ఏం చేస్తాడో?**

నాలుగేళ్ల ముందు లీగ్‌లోకి అడుగు పెట్టిన తొలి సీజన్లోనే టైటిల్ సాధించి ఔరా అనిపించింది గుజరాత్ టైటాన్స్. అప్పుడు ఆ జట్టును నడిపించింది హార్దిక్ పాండ్య. తర్వాతి సీజన్లోనూ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఆ జట్టుతోనే ఉంటే హార్దిక్ కెప్టెన్‌గా ఇంకా గొప్ప పేరు సంపాదించేవాడేమో. కానీ తన పాత ఫ్రాంఛైజీ ముంబయి ఇండియన్స్ నుంచి పిలుపు వచ్చిందని అక్కడికి వచ్చేశాడు. రోహిత్ శర్మను తప్పించి సారథ్యం అప్పగిస్తే సంతోషంగా స్వీకరించాడు. కానీ అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్న హార్దిక్.. తన నిర్ణయానికి చాలా చింతించే పరిస్థితి తెచ్చుకున్నాడు. 2024 సీజన్‌లో ముంబయి ఎక్కడ మ్యాచ్ ఆడినా.. హార్దిక్‌కు వ్యతిరేకంగా నినాదాలు తప్పలేదు. ఆ జట్టు ప్రదర్శన కూడా అందుకు తగ్గట్లే సాగింది. అయితే గత ఏడాది పరిస్థితి మారింది. ముంబయి ఆట మారింది. హార్దిక్‌పైనా వ్యతిరేకత తగ్గింది. ఇప్పటిదాకా ఐపీఎల్‌లో అతను 60 మ్యాచ్‌ల్లో నాయకత్వం వహిస్తే.. 35 విజయాలు సాధించాడు. 25 మ్యాచ్‌లు ఓడాడు. ఈసారి ముంబయి మెరుగ్గా కనిపిస్తుండడంతో హార్దిక్ నాయకత్వంలో మంచి ఫలితాలు రాబట్టగలదనే అంచనాలున్నాయి.

**తొలిసారే కప్ సాధించి..**

ప్రతిసారీ భారీ అంచనాలతో బరిలోకి దిగడం.. కప్పు లేకుండానే వెనుదిరగడం.. 17 సీజన్ల పాటు బెంగళూరు పరిస్థితి ఇదే. కానీ నిరుడు కెప్టెన్ అయిన తొలి సీజన్లోనే ఆ జట్టుకు ట్రోఫీ అందించి చరిత్ర సృష్టించాడు రజత్ పాటీదార్. బ్యాటర్‌గా జట్టును ముందుండి నడిపించిన రజత్.. కెప్టెన్‌గానూ తనదైన ముద్ర వేశాడు. తన సారథ్యంలో ఆర్సీబీ 13 మ్యాచ్‌లు ఆడి, మూడు మాత్రమే ఓడింది. 10 విజయాలతో కప్పును సొంతం చేసుకుంది. ఈసారి కూడా రజత్ మీద మంచి అంచనాలే ఉన్నాయి.

**ధోని వైభవం కొనసాగించేలా...**

ధోని సారథ్యంలో వైభవం చూసిన చెన్నై సూపర్‌కింగ్స్‌ను రెండేళ్లుగా రుతురాజ్ గైక్వాడ్ నడిపిస్తున్నాడు. కానీ అతను ఎంఎస్ వారసత్వాన్ని నిలబెట్టలేకపోతున్నాడు. బ్యాటర్‌గా రాణిస్తున్నప్పటికీ.. సారథిగా ప్రభావం చూపలేకపోతున్నాడు. గత ఏడాది గాయం కారణంగా టోర్నీ నుంచి రుతురాజ్ అర్ధంతరంగా తప్పుకొంటే ధోనీనే మిగతా సీజన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈసారి మళ్లీ జట్టు పగ్గాలు అందుకుంటున్నాడు రుతురాజ్. తాను నిష్క్రమించేలోపు సీఎస్కేను మంచి స్థితిలో నిలపాలన్నది ధోని ఆలోచన. బహుశా ఈ సీజన్లోనే మహి తప్పుకొంటే ఆశ్చర్యమేమీ లేదు. మరి అతను కోరుకున్నట్లుగా చెన్నై ఉత్తమ స్థితికి చేరుకుంటుందా? కెప్టెన్‌గా రుతురాజ్ బలమైన ముద్ర వేస్తాడా అన్నది చూడాలి.




## పీఎస్ఎల్‌కు షాక్ ఇచ్చి..
# ఐపీఎల్‌లోకి డాసున్ శనక ఎంట్రీ!

పాకిస్థాన్ సూపర్ లీగ్ నుంచి విదేశీ క్రికెటర్లు ఒక్కొక్కరు వీడుతున్నారు. అక్కడి భద్రతతోపాటు ఆర్థికపరమైన అంశాలతో బయటకొచ్చేస్తున్నట్లు సమాచారం. తాజాగా శ్రీలంక కెప్టెన్ డాసున్ శనక కూడా ఇదే నిర్ణయం తీసుకున్నాడు. దీంతో శనక ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. గత వేలంలో అతడిని ఎవరూ కొనుగోలు చేయలేదు. పీఎస్ఎల్ వేలంలో 75 లక్షల పాకిస్థాన్ రూపాయలు దక్కించుకున్నాడు. అయినా సరే ఆ లీగ్‌ను వదిలి.. రాజస్థాన్ రాయల్స్ జట్టుతో చేరే అవకాశం ఉంది. "అవును.. మేం శనకతో ఒప్పందం చేసుకొనే దిశగా వెళ్తున్నాం. కొన్ని అంశాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. శ్రీలంక క్రికెట్ బోర్డుతో అతడు పేపర్ వర్క్‌ను కంప్లీట్ చేయాల్సి ఉంది. అది ముగియగానే శనకతో అగ్రిమెంట్ చేసుకుంటాం. త్వరలోనే మా జట్టుతో చేరతాడు" అని రాజస్థాన్ రాయల్స్ అధికారులు పేర్కొన్నారు. ఐపీఎల్ వేలంలో అతడు రూ. 75 లక్షల బేస్ ప్రైస్‌తో వచ్చాడు. ఇప్పుడు అతడికి ఆ మొత్తమే ఇచ్చే అవకాశం ఉంది.


**ముచ్చటగా మూడో ప్లేయర్..**

ఇప్పటికే జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్స్ ముజరబాని కూడా ఇలాగే పీఎస్ఎల్‌ను వీడి.. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో చేరిపోయాడు. ఇప్పుడు డాసున్ శనక రాజస్థాన్‌కు రాబోతున్నాడు. అయితే, గతేడాది దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ కార్బిన్ బాష్ పీఎస్ఎల్‌ను వదిలి.. ఐపీఎల్ మిడ్ సీజన్‌లోనే ముంబయి జట్టుతో కలిసిపోయాడు. అతడి నుంచే ఈ ట్రెండ్ ప్రారంభమైంది. ప్రస్తుతం ముగ్గురు క్రికెటర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు.




రాబోయే కాలంలో మరింత మంది బయటకు రావడం ఖాయమని తెలుస్తోంది.

# డయాబెటిక్‌తో దంత సమస్యలు వస్తాయా?



దంతాలపై డయాబెటిక్ తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు డయాబెటిక్‌కు, దంతాలకు ఉన్న సంబంధం ఏంటి? ఎలాంటి సమస్యలు వస్తాయో తెలుసుకుందాం. డయాబెటిక్‌కు, దంతాల ఆరోగ్యానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. షుగర్ ఉన్న పేషెంట్ రక్తంలో చక్కెర స్థాయులు అధికంగా ఉండటం. ఇది రెండు రకాలు. మొదటిది.. టైప్-1 డయాబెటిస్. రెండోది.. టైప్-2 డయాబెటిస్. ఎక్కువమందిలో కనిపించేది రెండో రకమే. గర్భిణులలోనూ కొన్నిసార్లు హార్మోన్ మార్పుల వల్ల చక్కెర నిల్వలు పెరిగే అవకాశం ఉంది. కానీ కొద్దిరోజులకే నియంత్రణలోకి వస్తుంది.

### పిప్పిపళ్లు

మనం తీసుకునే ఆహారంలో ఉన్న చక్కెర, పిండిపదార్థాలకు నోటిలోని బ్యాక్టీరియా వేగంగా స్పందిస్తుంది. దీనివల్ల దంతాలపై సన్నని గార ఏర్పడుతుంది. దీనిలోని రసాయనాలు పంటి పైభాగంలోని ఎనామిల్‌ను, డెంటిన్‌ను దెబ్బతిస్తాయి. దీనివల్ల పిప్పిపళ్లు పుట్టుకొస్తాయి. బ్లడ్ షుగర్ ఎంత పెరిగితే అంత ఎక్కువగా గార పేరుకుపోతుంది. రసాయనాల దాడి అధికమవుతుంది. నోరంతా పిప్పి విస్తరించవచ్చు.

### చిగుళ్ల వ్యాధులు

వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో హానికర బ్యాక్టీరియా ప్రాబల్యం పెరుగుతుంది. దీనివల్ల గార మరింత గట్టిపడుతుంది. క్రిమి కీటకాలకు చిరునామాగా మారుతుంది. అంతేకాకుండా.. చిగుళ్లనూ దెబ్బతీస్తుంది. దీంతో చిగుళ్లు ఉబ్బడం, రక్తం కారడం తదితర ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ సమస్యను 'జింజివైటిస్' అంటారు. దీన్ని చిగుళ్ల వ్యాధికి మొదటి దశగా పరిగణిస్తారు.

### పెరియోడాంటైటిస్

జింజివైటిస్‌కు సకాలంలో చికిత్స చేయకపోతే.. పంటికింది ఎముకను క్రమంగా తినేయడం మొదలుపెడుతుంది. దీంతో పన్ను వదులైపోతుంది. ఓ దశలో ఊడిపోతుంది. దీన్నే వైద్య పరిభాషలో 'పెరియోడాంటైటిస్' అంటారు. ఈ సమస్య సాధారణ వ్యక్తులలో కంటే డయాబెటిక్ రోగుల్లో మూడురెట్లు అధికం. డయాబెటిక్ రోగుల్లో ఇట్టే దంతాలు కదులుతాయి. అంతే కాకుండా చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి చీము రావడం తదితర ఇబ్బందులూ వెంటాడతాయి.

### క్రష్

నాలుకపై ఫంగల్ ఇన్ఫెక్షన్ రావడాన్నే 'క్రష్' అంటారు. ఈ ప్రభావంతో నాలుకపై తెలుపు లేదా ఎరుపు రంగు మచ్చలాంటిది ఏర్పడుతుంది. ఇది కొంతమేర నొప్పిని కలిగిస్తుంది. డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య మరీ అధికం.

### డ్రై మౌత్

నోట్లో లాలాజలం తగ్గినప్పుడు నోరు పొడిబారుతుంది. దీన్నే 'డ్రై మౌత్' అంటారు. లాలాజలం ఎప్పటికప్పుడు నోటిని శుభ్రపరుస్తుంది. రసాయనాలు మరీ పెరిగిపోకుండా, మరీ తగ్గిపోకుండా సమతౌల్యం చేస్తుంది. లాలాజలం తగ్గడం వల్ల రసాయన స్థాయులు అధికమై నోరు అపరిశుభ్రంగా మారుతుంది. దీంతో పిప్పిపళ్లు తదితర సమస్యలు వెంటాడుతాయి.

### నోటి దుర్వాసన

నోటి దుర్వాసన వేధిస్తుంది. కాబట్టి మధుమేహం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో, దంత సమస్యల విషయం లోనూ అన్ని వైద్యపరమైన చర్యలు తీసుకోవాలి.

### మౌత్‌వాష్..

ఏదైనా తిన్న తర్వాత మంచినీళ్లతో పుక్కిలించి ఉమ్మడం మంచి అలవాటు. దీనికితోడు.. ముడి ఉప్పును గోరువెచ్చని నీటిలో కలిపి రోజూ నోటిని శుభ్రపర్చుకోవాలి. దీనివల్ల ఇన్ఫెక్షన్లు కొంతమేర నియంత్రణలో ఉంటాయి. వైద్యుల సలహాతో మార్కెట్‌లో లభించే నాణ్యమైన మౌత్‌వాష్‌లనూ వాడవచ్చు. రసాయనాల ప్రభావం లేనివైతే మరీ మంచిది. దీనివల్ల సగానికి సగం హానికర బ్యాక్టీరియాను తొలిదశలోనే వదిలించుకోవచ్చు.




టైప్1 డయాబెటిక్ రోగుల్లో జన్యుపరంగానే ఇన్సులిన్ ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. డయాబెటిస్‌తో బాధపడే బాలల్లో అయితే.. 20 ఏండ్ల లోపే దంతాలు ఊడిపోవడం మొదలవుతుంది. కనీసం నాలుగు మూల దంతాలు ఊడిపోతే.. దాన్ని టైప్1 డయాబెటిస్‌గా పరిగణిస్తారు. టైప్2లో ఇన్సులిన్ ఉత్పత్తి జరిగినా, షుగర్‌ను నియంత్రించేంత స్థాయిలో ఉండదు. టైప్1, టైప్2.. రెండు డయాబెటిక్ రకాలూ దంతాలపై ఒకేలా ప్రభావం చూపుతాయి. ఒకేరకమైన ఇబ్బందిని కలిగిస్తాయి. గర్భిణులలో హార్మోన్ మార్పుల వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం లేకపోలేదు. అయితే, ప్రసవం తరువాత 90 శాతం మందిలో షుగర్ మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటుంది. మధుమేహం తీవ్రంగా ఉన్న సమయంలో సాధారణ రోగుల్లో కనిపించే చిగుళ్లు, దంతాల సమస్యలే.. గర్భిణులనూ ఇబ్బంది పెడతాయి. డయాబెటిక్ పేషెంట్లలో ఇమ్యూనిటీ పడిపోతుంది. హానికర బ్యాక్టీరియాతో పోరాడే సత్తువ సన్నగిల్లుతుంది. ఫలితంగా ఆ బ్యాక్టీరియా నోటిపై ప్రభావం చూపుతుంది. గాయాలు ఓ పట్టాన మానిపోవు. అక్కడితో ఆగకుండా, ఆ బ్యాక్టీరియా కక్షగట్టినట్టు షుగర్ స్థాయులను పెంచుతుంది. దీనివల్ల నోటి ఇన్ఫెక్షన్లు అధికమవుతాయి. అంటే.. నోటిలో ఇన్ఫెక్షన్లు పెరిగితే మధుమేహ తీవ్రత పెరుగుతుంది. మధుమేహ తీవ్రత పెరిగితే నోటిలో ఇన్ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. ఈ బంధానికి అడ్డుకట్ట వేయాలి. డయాబెటిస్ రోగులను ప్రధానంగా ఆరురకాల దంత సమస్యలు వేధిస్తాయి. పిప్పిపళ్లు, చిగుళ్ల సమస్య, పెరియో డాంటైటిస్, క్రష్,. డ్రై మౌత్ నోటి దుర్వాసన.

### నివారణ చర్యలు ఇలా..

మధుమేహం నియంత్రణలో ఉండేలా చూసుకోవాలి. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలి. ఉదయం లేవగానే ఒకసారి.. రాత్రి పడుకునే ముందు మరోసారి బ్రష్ చేయాలి. రాత్రి బ్రష్ చేసిన తర్వాత ఎలాంటి ఆహారమూ తీసుకోరాదు. సున్నితంగా ఉండే బ్రష్‌లనే ఎంచుకోవాలి. మరీ బలంగా రుద్దినట్టు కాకుండా, ఒక పద్ధతి ప్రకారం తోముకోవాలి. కనీసం రెండు నిమిషాలపాటు బ్రష్ చేయాలి. మూడు నెలలకు ఒకసారి బ్రష్ మార్చాలి. అవసరమైతే, రోజు ఫ్లాసింగ్ చేయాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. సాధారణ ఆరోగ్యవంతులు ఏడాదికోసారి నిపుణులతో దంతాలను శుభ్రం చేయించుకోవాలి. డయాబెటిస్ ఉన్నవారు ఆ విషయాన్ని దంత వైద్యులకు తప్పక చెప్పాలి. నోటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. ధూమపానం కూడా దంతాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి, ఆ





# మీరు తినే ఫుడ్‌లో ఫైబర్ ఉందా?



శరీర ఆరోగ్యానికి తగినంతగా ఫైబర్‌తో కూడిన ఆహారం తీసుకోవడం కీలకం. జీర్ణక్రియ సాఫీగా సాగడం నుంచి కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్ లెవెల్స్ కంట్రోల్ వరకు ఫైబర్‌తో ఎన్నో ప్రయోజనాలున్నాయి. మలబద్ధకాన్ని నివారించి ప్రేగుల కదలికలను ప్రేరేపించి జీర్ణక్రియ సజావుగా సాగేలా చూస్తుంది. ఫైబర్ అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడంతో పాటు ఆరోగ్యకర జీవనశైలిని అనుసరిస్తే ఫైబర్ లోపాలను అధిగమించడంతో పాటు శరీర ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చు.

ఆరోగ్యానికి కీలకమైన ఫైబర్‌లో రెండు రకాలుంటాయి. నీటిలో కరిగే సాల్యూబుల్ ఫైబర్ రక్తంలో కొలెస్ట్రాల్ లెవల్స్‌ను, బ్లడ్‌షుగర్ లెవెల్స్‌ను తగ్గిస్తుంది. నీటిలో కరగని ఇన్‌సాల్యూబుల్ ఫైబర్ మలబద్ధకాన్ని నివారించి ప్రేవుల కదలికలను ప్రేరేపిస్తుంది. అయితే మనం ఫైబర్ తగినంతగా తీసుకోవడం లేదని పలు సంకేతాల ద్వారా తెలుసుకోవచ్చు. మలబద్ధకం, గ్యాస్, కడుపుబ్బరం, తిన్న వెంటనే ఆకలివేయడం, నీరసం, నిస్సత్తువ, చర్మం నిర్జీవంగా ఉండటం, తీవ్ర అనారోగ్యాల ముప్పు, అధిక కొలెస్ట్రాల్ లెవెల్స్, మలం గట్టిపడటం, విపరీతంగా బరువు పెరగడం లేదా తగ్గడం.. ఈ లక్షణాలు కనిపిస్తే మీరు తినే ఫుడ్‌లో ఫైబర్ శాతం తగ్గినట్లే.




## ట్రూ కాలర్‌లో నయా ఫీచర్..

# ఫ్రాడ్ కాల్స్‌కు చెక్

### ఫ్రాడ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు నయా ఫీచర్

గుర్తు తెలియని నంబర్ల ఎన్నో ఫ్రాడ్ కాల్స్ వస్తుంటాయి. సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇటీవల కాలంలో ఏఐ సాయంతో వ్యక్తుల వాయిస్‌ను క్లోన్ చేసి సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారు. మోసపోయిన విషయం బాధితులకు కూడా కొన్నిసార్లు ఆలస్యంగా తెలుస్తోంది. ఇలాంటి మోసాలకు చెక్ పెట్టేందుకు ట్రూకాలర్ కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఏఐ స్కామ్ కాల్స్‌ను గుర్తించేందుకు కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. ఏదైనా కాల్ వచ్చినప్పుడు ఆ వాయిస్ ఏఐ సాయంతో జనరేట్ చేసినదా? కాదా? అనేది కొన్ని క్షణాల్లో ట్రూకాలర్‌లోని ఈ ఫీచర్ చెప్పేస్తుంది. అందుకోసం కొన్ని క్షణాల పాటు ఆ వాయిస్‌ను రికార్డు చేసి అనలైజ్ చేస్తుంది. ఇందుకోసం తమ సొంత ఏఐ మోడల్‌ను వాడుతున్నట్లు ట్రూకాలర్ తెలిపింది. సోషల్‌మీడియాలోని వీడియోలతో పాటు కొందరు వ్యక్తుల వాయిస్‌ను ఉపయోగించినట్టు ట్రూకాలర్ తెలిపింది. ఏఐ స్కామ్ కాల్స్‌ను గుర్తించేందుకు ట్రూకాలర్‌ను డిఫాల్ట్ కాలర్ యాప్‌గా సెట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆపై ఏదైనా అనుమానాస్పద కాల్ వస్తే స్టార్ట్ డిటెక్షన్‌పై క్లిక్ చేస్తే కాల్‌ను రికార్డు చేసికొన్ని వెంటనే దాన్ని అనలైజ్ చేస్తుంది. ఫలితాన్ని నోటిఫికేషన్ రూపంలో తెలియజేస్తుంది. తొలుత అమెరికాలోని ఆండ్రాయిడ్ ప్రీమియం యూజర్లకు ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ తెలిపింది. రాబోయే నెలల్లో భారత్ సహా ఇతర మార్కెట్లకు ఈ సదుపాయం తీసుకొస్తామని కంపెనీ తెలిపింది.

# మోదీకి నేను 'అంధభక్తురాలిని'.. 'ధురంధర్ 2' సినిమాపై రేణు దేశాయ్ కామెంట్స్ వైరల్!

* ప్రధాని మోదీకి, బీజేపీకి తాను గర్వపడే అంధభక్తురాలినని ప్రకటించిన రేణు దేశాయ్
* 'ధురంధర్ 2' సినిమాను ప్రశంసిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు
* 'చాయ్‌వాలా' అధికారంలోకి వచ్చాక శత్రువుల్లో భయం పెరిగిందన్న డైలాగ్‌ను షేర్ చేసిన వైనం
* సైన్యాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూడాలని సూచన
* సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన రేణు దేశాయ్ వ్యాఖ్యలు





నటి రేణు దేశాయ్ సోషల్ మీడియా వేదికగా చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీని ప్రశంసిస్తూ తాను "గర్వపడే అంధభక్తురాలిని" అని ఆమె బహిరంగంగా ప్రకటించారు. తాజాగా 'ధురంధర్ 2' సినిమాను సమీక్షిస్తూ ఆమె పెట్టిన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' చిత్రాన్ని వీక్షించిన అనంతరం రేణు దేశాయ్ తన అభిప్రాయాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఈ క్రమంలో ఆ సినిమాలోని ఓ సన్నివేశాన్ని ఆమె ప్రత్యేకంగా హైలైట్ చేశారు. ఆ వీడియో క్లిప్‌లో అస్వస్థతతో ఉన్న దావూద్ ఇబ్రహీంను పోలిన ఓ విలన్ పాత్ర, "ఎప్పటి నుంచైతే ఈ చాయ్‌వాలా హిందుస్థాన్‌లో అధికారంలోకి వచ్చాడో, అప్పటి నుంచి మన వాళ్లలో భయం ఇంకా పెరిగిపోయింది" అని అంటుంది. "చాయ్‌వాలా కా జల్వా" అనే క్యాప్షన్‌తో ఉన్న ఈ వీడియోను రీషేర్ చేసిన రేణూ, "బీజేపీకి, మన అద్భుతమైన ప్రధాని మోదీజీకి నేను గర్వపడే అంధభక్తురాలిని" అని రాసుకొచ్చారు. అంతకుముందు మరో పోస్ట్‌లో మన సైనిక దళాలు, నిఘా ఏజెన్సీల పట్ల గౌరవం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సినిమాను తప్పకుండా చూడాలని ఆమె సూచించారు. "వారి వల్లే మనం మన ఇళ్లలో ప్రశాంతంగా జీవిస్తున్నాం" అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీలో జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి అధికారంలో ఉండగా, పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ రాజకీయ నేపథ్యంలో రేణు దేశాయ్ నేరుగా ప్రధాని మోదీకి, బీజేపీకి ఇంత బలంగా మద్దతు తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆమె వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

## సినిమా

# పింక్ లెహంగాలో..



అందం, అభినయంతో రెండు దశాబ్దాలుగా టాలీవుడ్ ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. కేవలం వెండి తెరపైన మాత్రమే కాకుండా ఫ్యాషన్‌ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. తాజాగా లక్మే ఫ్యాషన్ వీక్ వేదికగా ఈ బ్యూటీ ధరించిన పింక్ డిజైనర్ దుస్తులు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఈ ఫోటోలోని మెరుపులు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ భూమిక శర్మ రూపొందించిన ఆఫ్టర్ గ్లో కలెక్షన్‌లో భాగంగా ఈ పింక్ కలర్ మోడ్రన్ లెహంగాలో తమన్నా మెరిసింది. పింక్ లెహంగాపై చేసిన సునిశితమైన ఎంబ్రాయిడరీ వర్క్.. జతగా ఎంపిక చేసుకున్న మోడ్రన్ బ్లౌజ్ ఆమె అందాన్ని రెట్టింపు చేశాయి. ఆధునికత, సంప్రదాయం కలగలిసిన ఈ లెహంగాలో ఎంతో హుందాగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం పురుషన్, ఓ రోమియో, రేంజర్ చిత్రాల్లో నటిస్తోంది. వివాన్- ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్ షూటింగ్ దశలో ఉంది. నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్ వంటి ప్రముఖ ఓటీటీ సంస్థల కోసం కొన్ని వెబ్ ఒరిజినల్స్‌లో నటించనున్నట్లు సమాచారం.

# నన్ను భయపెట్టారు



సౌత్‌సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మలయాళీ కుట్టి నయనతార.. దాదాపు స్టార్‌హీరోలందరితోనూ ఆడిపాడింది. ఇటీవల ' మన శంకర వర ప్రసాద్‌గారు' మూవీలో మెగాస్టార్‌చిరంజీవితోనూ జతకట్టింది ఈ లేడీ సూపర్ స్టార్. ఇక లేటెస్టుగా యశ్ నటిస్తున్న 'టాక్సిక్' మూవీలో ఆమె గంగ పాత్రలో కనిపించనుంది. మరోవైపు స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్న తరుణంలోనూ స్పెషల్‌సాంగ్స్ తోనూ అలరించింది. కాగా.. ఇటీవల తన గతంలో జరిగిన ఒక ఘటన గురించి నయనతార గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యింది. 'విజయ్ 'శివకాశీ' చిత్రంలో స్పెషల్‌సాంగులో నాకు నటించే చాన్స్ వచ్చింది. అందుకు నేను కూడా ఒప్పుకున్నాను. అయితే ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటూ చాలా మంది నన్ను ప్రశ్నించారు. ఇకపై అందరూ అలాంటి పాటల్లోనే నటించమని అడుగుతారని భయపెట్టారు. అయితే స్పెషల్ పాట అయితే స్పెషలేగా.. ఏదో ఒక ఇమేజ్ ఉంటేనే నాకు స్పెషల్ సాంగ్‌లో నటించే అవకాశం వచ్చింది. దాని ద్వారా పలు విషయాలు నేర్చుకోవచ్చని భావించా. అలా నేను నటించిన రెండు స్పెషల్ సాంగ్స్‌తో చాలా విషయాలు నేర్చుకున్న' అంటూ నయన్ చెప్పుకొచ్చింది.

# ఫేక్ సింగ్ దుమారం



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి పూనమ్ కౌర్. కేవలం వెండితెరపై నటనకే పరిమితం కాకుండా, సమాజంలో జరిగే అన్యాయాలపై, ముఖ్యంగా మహిళా సమస్యలపై తన గళాన్ని వినిపిస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తుంటుంది. తాజాగా ధురంధర్ 2 సినిమా విడుదల నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన ఈ సినిమా చూసిన పూనమ్ ఆసక్తికరమైన పోస్ట్ చేసింది. ది రియల్ సింగ్, స్టోరీ ఆఫ్ రియల్ హీరో అంటూ..ఏ ఫేక్ సింగ్ కూడా ఈ బాక్సాఫీస్ ముందు నిలబడలేరని చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. వాస్తవానికి ధురంధర్ 2 విడుదలైన సమయంలోనే పవన్ కల్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ కూడా థియేటర్లలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పూనమ్ చేసిన ఫేక్ సింగ్ వ్యాఖ్యలు నేరుగా పవర్‌స్టార్‌ను ఉద్దేశించినవేనని మెగా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## గోల్డ్ స్మగ్లింగ్: రూ.2 కోట్లు మోసపోయిన కన్నడ నటి రన్యా రావు!



కన్నడ చిత్ర పరిశ్రమను కుదిపేసిన గోల్డ్ స్మగ్లింగ్ కేసులో నిందితురాలైన నటి రన్యా రావుకు సంబంధించి ఓ విస్తుపోయే నిజం బయటపడింది. అక్రమ మార్గంలో కోట్లు సంపాదించాలని స్మగ్లింగ్ మొదలుపెట్టిన ఆమె, అదే ప్రయత్నంలో ఏజెంట్ చేతిలో మోసపోయి రూ.2 కోట్లు నష్టపోయినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలో వెల్లడైంది. తక్కువ ధరకు నేరుగా ఆఫ్రికా గనుల నుంచి బంగారం కొనుగోలు చేయాలని రన్యా ప్లాన్ చేసింది. ఇందుకోసం 'బెన్' అనే ఉగాండా ఏజెంట్‌ను నమ్మింది. అయితే, ఆ ఏజెంట్ ఆమె నుంచి రూ.2 కోట్లు తీసుకుని, బంగారం ఇవ్వకుండా మోసం చేశాడు. ఆఫ్రికాలో మోసపోయిన తర్వాత, రన్యా తన పంథా మార్చింది. దుబాయ్ మార్కెట్లో బంగారం కొని భారత్‌కు అక్రమంగా తరలించడం ప్రారంభించింది. తన సవతి తండ్రి సీనియర్ పోలీస్ అధికారి (ఏడీజీపీ) కావడంతో ఎయిర్‌పోర్టులో లభించే 'ప్రొటోకాల్' సౌకర్యాన్ని దుర్వినియోగం చేసింది. దీని ద్వారా కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి సులభంగా తప్పించుకునేది. 2024 మార్చి నుంచి 2025 మార్చి మధ్య కేవలం ఏడాది కాలంలోనే ఆమె 15 సార్లు దుబాయ్ వెళ్లివచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఈ పర్యటనల్లో సుమారు 127 కిలోల బంగారాన్ని స్మగ్లింగ్ చేసినట్లు ఈడీ తన ఛార్జ్ షీట్‌లో పేర్కొంది. దీని విలువ సుమారు రూ.102 కోట్లు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఈ కేసులో రన్యా రావు బెంగళూరు సెంట్రల్ జైలులో ఉంది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) ఆమెకు సుమారు రూ.102.55 కోట్ల భారీ జరిమానా విధించింది. ఈ కేసులో ఆమె తండ్రి పాత్రపై కూడా అంతర్గత విచారణ కొనసాగుతోంది.

## ఇరుముడి' కోసం రీమిక్స్ పాట?



రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో రవితేజ అయ్యప్ప స్వామి భక్తుడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే దీనికోసం ఎంతో ప్రాచుర్యం పొందిన అయ్యప్ప గీతం ''ఎక్కినాడు పల్లకి''ని రీమిక్స్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ అంశంపై సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ స్పందించారు. ఆ పాటను రీమిక్స్ చేయమని ప్రేక్షకులు, అభిమానుల నుంచి డిమాండ్ వస్తున్న మాట వాస్తవమని.. దర్శక నిర్మాతలు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలియజేశారు. మరి త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందేమో చూడాలి. తండ్రీకూతురు అనుబంధాలతో ముడిపడిన ఎమోషన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ ఏడాది ఆఖర్లో తెరపైకి రానుంది. ఈ చిత్రానికి కూర్పు: ప్రవీణ్ పూడి, ఛాయాగ్రహణం: విష్ణు శర్మ.

## కొందరు రాజులు ఎప్పటికీ మరణించరు!

'శంబాల' విజయంతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించారు దర్శకుడు యుగంధర్ ముని. దీన్ని మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడిదే కాంబోలో మరో సోషియో ఫాంటసీ సినిమా పట్టాలెక్కనుంది. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని శనివారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఓ కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. యుద్ధభూమిలో ఓ సింహం, తోడేలు పోరుకు సిద్ధమవుతున్నట్లు చూపించడం..ఆ రెండింటి మధ్య ఓ పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ''కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు'' అంటూ ఆ పోస్టర్‌కి జోడించిన వ్యాఖ్య సినిమాపై అంచనాలు పెంచేలా ఉంది. ''ప్రేక్షకుల్ని సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ఇది. సందీప్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రంగా నిలవనుంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమవుతుంది'' అని నిర్మాతలు ప్రకటించారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తామన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.